RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక




హైదరాబాద్ | బుధవారం 12-8-2026 | సంచిక: 13 | సంఖ్య: 314 పేజీలు: 8 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి

## అందుకే రేవంత్ రెడ్డి వద్దకు వెళ్లి కండువా కప్పుకున్నా

పెండింగ్ బిల్లులకు ప్రభుత్వం సగం నిధులే ఇచ్చిందని అసంతృప్తి

అన్నం పెట్టిన వారిని ఎప్పటికీ మర్చిపోలేనని వ్యాఖ్య

ప్రస్తుతం ముఖ్యమంత్రి, మంత్రులు ఫోన్లు ఎత్తడం లేదని ఆరోపణ

- మిగతా 2,వ పేజీలో



2లో

## ఆగస్టు 18 నుంచి కేబీఆర్ పార్క్ చుట్టూ వన్-వే ట్రాఫిక్

ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు చర్యలు

ఇప్పటికే ట్రయల్ రన్ విజయవంతమైందని తెలిపిన పోలీసులు

ప్రయాణికులు కొత్త మార్గాలను అనుసరించాలని సూచన





## పరుగులు పెడుతున్న ఏపీ ఆర్థిక వ్యవస్థ..

### జాతీయ సగటు కంటే మెరుగైన వృద్ధి

జాతీయ సగటును మించి ఏపీ ఆర్థిక వృద్ధి నమోదు

2025-26లో 9.9 శాతానికి చేరిన రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేటు

వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో గణనీయమైన ప్రగతి

ఎల్ నినో ప్రభావంపై సీఎం చంద్రబాబు ఆందోళన

సంక్షోభంలోనూ 15% వృద్ధి లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు ఆదేశం

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధి పథంలో పయనిస్తోంది. జాతీయ వృద్ధి రేటును అధిగమించి, వరుసగా రెండో ఏడాది కూడా రాష్ట్రం మెరుగైన ప్రగతిని నమోదు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేటు 9.9 శాతానికి చేరుకున్నట్లు

## డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'..

భారీ పెట్టుబడులే లక్ష్యం

సదస్సును అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

గతేడాది వచ్చిన పెట్టుబడులు, సాధించిన పురోగతిపై నివేదిక కోరిన సీఎం

వ్యాపార ప్రముఖులను సదస్సులో సత్కరించేలా ప్రణాళిక

హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 పనులపైనా సీఎం సమీక్ష

రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు సమకూర్చుకోవాలని ఆదేశం



తెలంగాణకు భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా డిసెంబరులో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. సదస్సును అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

గత ఏడాది సదస్సు ద్వారా వచ్చిన పెట్టుబడులు, సాధించిన పురోగతిపై సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు.



## రెండు రోడ్డు ప్రమాదాలు.. 8మందిమృతి

ఆటోను ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో ఆరుగురు దుర్మరణం

వీరిలో ఐదుగురు కర్ణాటకకు చెందిన మహిళా కూలీలు

డివైడర్‌ను ఢీకొట్టి కారు ఎగిరి పడిన ఘటనలో ఇద్దరు మృతి

సంగారెడ్డి జిల్లాలో దుర్ఘటనలు మృతుల కుటుంబాలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రగాఢ సానుభూతి

2లో

## కేటీఆర్ సంచలన ఆరోపణలు

సీఎం సోదరులు షెల్ కంపెనీలతో లబ్ధి పొందుతున్నారనీ కేటీఆర్ ఆరోపణ

టెసరాక్ కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమి కేటాయించారని విమర్శ

కేవలం లక్ష రూపాయల మూలధనంతో కంపెనీ ఏర్పాటు చేశారని వెల్లడి

రేవంత్ సోదరులకు షెల్ కంపెనీలు.. భారీగా లబ్ధి: కేటీఆర్ సంచలన ఆరోపణలు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు నామమాత్రపు అర్హతలతో భారీ కంపెనీలను రిజిస్టర్ చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి పొందుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు.

2లో



## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం.. ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం

- 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనాలని మోదీ పిలుపు
- ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని సూచన
- స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని విజ్ఞప్తి
- 'వికసిత్ భారత్' నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయాలని పిలుపు
- ఈ ఏడాది 'వందేమాతరం'కు ప్రత్యేక ప్రాధాన్యం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రజలు చురుగ్గా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా..

## డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరగాల్సిందే..

### నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి: రోజా

పుత్తూరులో రోజా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

డీఎస్సీలో భారీగా అక్రమాలు, అవకతవకలు జరిగాయన్న రోజా

నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవద్దని ప్రభుత్వానికి హితవు



## మయన్మార్‌లో చిక్కుకున్న ఏపీ యువతను ఆదుకుంటాం

బాధితులను స్వదేశానికి రప్పించాలని అధికారులకు ఆదేశం

బ్యాంకాక్ ఉద్యోగాల పేరుతో మోసపోయిన బాధితులు

సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సూచన



నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# పరుగులు పెడుతున్న ఏపీ ఆర్థిక వ్యవస్థ..

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యంగా సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి 304 శాతం, వాణిజ్య వాహనాల విక్రయాలు 51.6 శాతం, ఎస్‌టిపిఐ ఎగుమతులు 32.2 శాతం మేర పెరిగాయి. సాంకేతికత వినియోగం ద్వారా జీఎస్టీ వసూళ్లు 21 శాతం వృద్ధితో రూ.13,282 కోట్లకు చేరాయి. రాష్ట్రంలోకి పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ. 2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టుల పెట్టుబడుల్లో 75.4 శాతం మేర గ్రౌండింగ్ పూర్తయింది. ఈ నివేదికను సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్రం ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైందని, కృష్ణా నదిలో నీటి లభ్యత లేక శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టులు నిండలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సంక్షోభ పరిస్థితుల్లోనూ రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలు దెబ్బతినకుండా పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రం 15 శాతం వృద్ధి రేటును సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రజలపై ధరల భారం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా, నియోజకవర్గం, మండలాల వారీగా నివేదికలు రూపొందిస్తే లక్ష్యాల సాధన సులభమవుతుందని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక, ప్రణాళికా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు

**దేశ నిర్మాణంలో భాగస్వాములు కండి: సీఎం చంద్రబాబు పిలుపు**

ప్రజలు, ఉద్యోగులు, అధికారుల సమష్టి భాగస్వామ్యంతో 'పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులే లక్ష్యంగా 'రోడ్ డాక్టర్' పేరుతో 'జీరో పాట్ హోల్ మిషన్'ను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సులభతరంగా చేరువ చేయడం ద్వారా ప్రతి ఒక్కరినీ జాతి నిర్మాణంలో భాగస్వాములను చేయాలని ఆకాంక్షించారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రతి అధికారి, ఉద్యోగి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టేలా 'రోడ్ డాక్టర్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పనులను చిత్తశుద్ధితో చేపట్టినప్పుడు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందని, భోగాపురం విమానాశ్రయ పనుల పురోగతికి లభిస్తున్న స్పందనే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. వాస్తవాలను ప్రజలకు వివరిస్తే వారే ప్రభుత్వానికి అండగా నిలుస్తారని, కర్నూలులో డీఎస్సీ-2025 ఉపాధ్యాయ అభ్యర్థులు చేపట్టిన కార్యక్రమమే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. జులై నెలలో రాష్ట్రం 10.70 శాతం ఆర్థిక వృద్ధిని సాధించిందని వెల్లడించిన ఆయన, రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆగస్టు 18 నుంచి కేబీఆర్ పార్క్ చుట్టూ వన్-వే ట్రాఫిక్

హైదరాబాద్‌లోని కాసు బ్రహ్మానంద రెడ్డి (కేబీఆర్) నేషనల్ పార్కు పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 18వ తేదీ నుంచి పార్కు చుట్టూ వన్-వే ట్రాఫిక్ విధానాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. హెచ్-సిటీ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనుల దృష్ట్యా ఈ మార్పులు చేస్తున్నట్లు వెల్లడించారు. నిర్మాణ పనుల కారణంగా రహదారి వెడల్పు తగ్గడంతో పాటు వాహనాల రద్దీ గణనీయంగా పెరిగిందని పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ వివరించారు. దీనివల్ల ఉభయ దిశల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, అందుకే వన్-వే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విధానాన్ని పూర్తిస్థాయిలో అమల్లోకి తీసుకురావడానికి ముందు నిర్వహించిన పైలట్ ట్రయల్స్ ద్వారా ప్రణాళికను మరింత మెరుగుపరిచినట్లు ఆయన పేర్కొన్నారు. నూతన విధానం అమలు కోసం పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధాన కూడళ్లలో లేన్ మార్కింగ్, లేన్ ఛేంజర్లు, దిశను సూచించే సైన్ బోర్డులను ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు 24 గంటల పాటు ట్రాఫిక్ సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. అలాగే, నావిగేషన్ యాప్‌లను సైతం అప్‌డేట్ చేశారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, సీసీటీవీ నెట్‌వర్క్, డ్రోన్ల ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ మార్పులు చేస్తామని వెల్లడించారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ఈ వన్-వే విధానం అమలులో ఉంటుందని పోలీసులు స్పష్టం చేశారు. వాహనదారులు తమ ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని, నిర్దేశించిన మార్గాల్లోనే ప్రయాణించాలని కోరారు. ముఖ్యంగా ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యతిరేక దిశలో వాహనాలు నడపవద్దని వారు సూచించారు.

# డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరగాల్సిందే..

కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీలో భారీగా అక్రమాలు, అవకతవకలు జరిగాయని, ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా డిమాండ్ చేశారు. నిరుద్యోగులను నట్టేట ముంచిన డీఎస్సీ ప్రక్రియపై సీబీఐ చేత తటస్థ విచారణ జరిపించాలని కోరుతూ నగరి నియోజకవర్గం పుత్తూరు పట్టణంలో ఆమె ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మొట్టమొదటి ఉద్యోగ నోటిఫికేషన్‌లోనే పేపర్ లీకేజీలు, అవినీతి అక్రమాలు రాజ్యమేలాయని రోజా తీవ్రస్థాయిలో ఆరోపించారు. ప్రశ్నాపత్రాన్ని తయారు చేసిన నవీన్ అనే వ్యక్తికే మొదటి ర్యాంక్ రావడమే పేపర్ లీక్ అయిందనడానికి సజీవ సాక్ష్యమని స్పష్టం చేశారు. పేపర్ లీకేజీ నిజం కాకపోతే మొదటి ర్యాంకర్ నవీన్‌కు ఉద్యోగం ఇవ్వకుండా, రెండో ర్యాంక్ నుంచి ఎందుకు నియామకాలు చేపట్టారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. మరోవైపు స్పోర్ట్స్ కోటా పేరుతో దొంగ జీవోలను తెచ్చి, పోస్టులను విచ్చలవిడిగా అమ్ముకుని రూ. కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకోవడం ఆపి, వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు నిరుద్యోగ భృతిని విడుదల చేయాలని ఆర్కే రోజా డిమాండ్ చేశారు.

## మయన్మార్‌లో చిక్కుకున్న ఏపీ యువతను ఆదుకుంటాం

ఉద్యోగాల పేరుతో మోసపోయి మయన్మార్‌లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ యువతకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. బ్యాంకాక్‌లో ఉద్యోగాలంటూ నమ్మించి కొందరిని మయన్మార్‌కు తరలించిన నేపథ్యంలో బాధితులను సురక్షితంగా స్వస్థలాలకు రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ఏపీ భవన్ అధికారులను ఆదేశించారు. వివరాల్లోకి వెళితే.. బ్యాంకాక్‌లో మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామన్న సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మిన పలువురు నిరుద్యోగ యువకులు మయన్మార్‌లో చిక్కుకుపోయారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి లోకేశ్, బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయం అందిస్తుందని స్పష్టం చేశారు. వారిని సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ యువతకు కీలక సూచనలు చేశారు. సైబర్ నేరగాళ్లు పన్నే ఉచ్చులో పడొద్దని, ఉద్యోగాల విషయంలో పూర్తిస్థాయిలో ఆరా తీయకుండా ఎవరినీ నమ్మవద్దని హితవు పలికారు.

# కేటీఆర్ సంచలన ఆరోపణలు

తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి సోదరులు బడా కంపెనీలకు యజమానులుగా మారుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. కనీసం ఒక్క ఉద్యోగి కూడా లేని కంపెనీలను చిన్న నివాసాల చిరునామాలతో రిజిస్టర్ చేయించారని పేర్కొన్నారు. అటువంటి ఒక కంపెనీకే దాదాపు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం కట్టబెట్టిందని విమర్శించారు. ముఖ్యంగా, అనుముల కొండల్ రెడ్డి తన లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లో 'టెసరాక్' కంపెనీకి ఛైర్మన్‌గా ఉన్నట్లు పేర్కొన్నారని తెలిపారు. మరో సోదరుడు జగదీశ్ రెడ్డి కాంట్రాక్టులు దక్కించుకుంటుండగా, ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్ట్ కట్టబెట్టారని ఆరోపించారు. ప్రతిపాదిత ఫోర్త్ సిటీ పరిధిలోని భూముల కేటాయింపులపై బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ ఒకరోజు ముందే ఇవే తరహా ఆరోపణలు చేసిన నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొండల్ రెడ్డి ఛైర్మన్‌గా ఉన్న టెసరాక్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మహేశ్వరం మండలం రావిర్యాలలో సుమారు ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకు కేటాయించారని, దాని అసలు మార్కెట్ విలువ రూ. 100 కోట్లకు పైగా ఉంటుందని క్రిశాంక్ పేర్కొన్నారు. ఆ కంపెనీకి కేవలం రూ.లక్ష మూలధనం ఉందని, పటాన్‌చెరులోని ఒక చిన్న నివాసం నుంచి కార్యకలాపాలు సాగిస్తోందని ఆరోపించారు. కాగా, క్రిశాంక్ చేసిన ఆరోపణలను మంత్రి డి.శ్రీధర్ బాబు తీవ్రంగా ఖండించారు.

# తెలంగాణలో రూ.200 కోట్ల సోలార్ స్కామ్.?

తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రూ.200 కోట్ల సోలార్ కుంభకోణానికి పాల్పడిందని బిజెపి ఎంపీ రఘునందన్ రావు తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ ఆయన కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం, ప్రజలను వంచించడమని మండిపడ్డ ఆయన, ఉచిత విద్యుత్ పేరిట కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదోవ పట్టిస్తోందని ధ్వజమెత్తారు. 'హర్ ఘర్ బిజిలీ ముక్త్ యోజన' పథకం కింద రాష్ట్రంలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వినియోగించుకునే 40 వేల ఇళ్లను గుర్తించి, వారి ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు అమర్చేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందని రఘునందన్ రావు వివరించారు. ఈ టెండర్లలో ఒక ఇంటిపై 2 కిలోవాట్ల సోలార్ ప్యానెల్ అమర్చేందుకు ఒక కంపెనీకి రూ.1,36,000లకు కాంట్రాక్ట్ కట్టబెట్టారని, అయితే ఆ కంపెనీ సబ్ కాంట్రాక్ట్‌ను కేవలం రూ.86,000లకే మరొకరికి ఇచ్చిందని బయటపెట్టారు. దీనివల్ల ఒక్కో ఇంటిపై ఏకంగా రూ.50 వేలు మిగులుతోందని, ఈ రకంగా మొత్తం 40 వేల ఇళ్లకు కలిపి రూ.200 కోట్ల మేర అవినీతి జరిగిందని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం 1 కిలోవాట్‌కు రూ.30 వేలు, 2 కిలోవాట్లకు రూ.60 వేల చొప్పున భారీగా సబ్సిడీ ఇస్తుంటే, మోదీ ప్రభుత్వం ఏమీ ఇవ్వడం లేదని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఈ స్కామ్‌పై నిజాయితీగా స్పందించి విచారణకు ఆదేశించాలని,



లేని పక్షంలో కేంద్రం నుంచి వచ్చే నిధులు నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**పార్లమెంట్ స్తంభనపై ప్రతిపక్షాలపై మండిపాటు**

పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగకపోవడంపై ఎంపీ రఘునందన్ రావు స్పందిస్తూ, సభను నడపడంలో అధికార పక్షంతో పాటు ప్రతిపక్షాలకు కూడా సమాన బాధ్యత ఉంటుందని గుర్తుచేశారు. ఢిల్లీ విద్యార్థుల ఆందోళనపై చర్చ ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రతిపక్షాల వద్ద సరైన సబ్జెక్ట్ లేకే రోజువారీ రచ్చ చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర హోంశాఖ మంత్రి కూడా దీనిపై సభలో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, ప్రతిపక్షాల గొడవ వల్ల ఇతర ఎంపీలు సభలో ప్రజా సమస్యలపై మాట్లాడే అవకాశాన్ని కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'..



గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సదస్సు ద్వారా ప్రపంచస్థాయి పెట్టుబడులను తెలంగాణకు తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వివిధ వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులను సదస్సులో సత్కరించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సంస్థాగత ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. గత ఏడాది సదస్సు తర్వాత తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతిపై వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని మరిన్ని పెట్టుబడులు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఇదే సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 పనులపైనా సీఎం సమీక్షించారు. పాతబస్తీలో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గంలో రోడ్డు విస్తరణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మెట్రో పనులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. పెండింగ్ భూసేకరణను పూర్తి చేసి విస్తరణ ప్రణాళికలను ఖరారు చేయాలని చెప్పారు. హైదరాబాద్ మెట్రోలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు సమకూర్చుకోవాలని అధికారులను ఆదేశించారు. పాతబస్తీ మెట్రో మార్గంలో అనుసరించాల్సిన సాంకేతికతపై ఢిల్లీ మెట్రో అధికారులతో సంప్రదించాలని సూచించారు.

# అందుకే రేవంత్ రెడ్డి వద్దకు వెళ్లి కండువా కప్పుకున్నా

తన నియోజకవర్గ అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరానని, పదవుల కోసమో, డబ్బు కోసమో కాదని బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పెండింగ్ బిల్లులకు సంబంధించి ప్రభుత్వం సగం నిధులే విడుదల చేయడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం బిర్కూర్‌లో పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారని పోచారం తెలిపారు. గత నవంబర్‌లో పార్టీ మారిన ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో ఇదే విషయాన్ని తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని గుర్తుచేశారు. ఆరు నెలల్లోగా బిల్లులు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం సగం నిధులే విడుదలయ్యాయని పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మిగతా మొత్తాన్ని మంజూరు చేయలేదని ఆయన ఆరోపించారు.

# రెండు రోడ్డు ప్రమాదాలు.. 8మంది మృతి

జహీరాబాద్ టౌన్: సంగారెడ్డి జిల్లా పరిధిలో 65వ జాతీయరహదారిపై మంగళవారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 8 మంది మృతి చెందారు. కర్ణాటక సరిహద్దుల్లోని జహీరాబాద్ మండలం సత్వార్ వద్ద ఆటోను వెనుక నుంచి ట్యాంకర్ బలంగా ఢీ కొట్టడంతో నలుగురు మహిళా కూలీలు రేఖ, శ్రీదేవి, కవిత, రేష్మ, ఆటో డ్రైవర్ దేవదాస్ అక్కడికక్కడే మృతి చెందారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ భార్య, కూలీ నిఖిత మృతి చెందింది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జయింది.

మృతదేహాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. గాయాలపాలైన ఏడుగురిని బీదర్, సంగారెడ్డి ఆస్పత్రులకు తరలించారు. మృతులంతా కర్ణాటకలోని రాజ్‌పూర్ గ్రామానికి చెందిన వారు. వీరంతా పనుల కోసం జహీరాబాద్ ప్రాంతానికి వచ్చి.. పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వీరు ప్రయాణిస్తున్న ఆటో జహీరాబాద్ వైపు నుంచి కర్ణాటకలోని తమ సొంతూరు రాజ్‌పూర్ వైపు వెళ్తుండగా ఓ లారీ యూ టర్న్ తీసుకుంటోంది. ఆ లారీని తప్పించబోయిన డ్రైవర్ ఆటోను పక్కకు తీయడంతో వెనుక నుంచి వేగంగా వస్తున్న ట్యాంకర్ ఢీకొని ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. వెనుక వైపు నుంచి వస్తున్న వాహనాన్ని గమనించకుండా పక్కకు తిప్పడంతో ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఆటోలో మొత్తం 12 మంది ప్రయాణిస్తున్నారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఘటనా స్థలాన్ని సంగారెడ్డి ఎస్పీ పరితోశ్ పంకజ్ పరిశీలించారు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం వెంకటాపూర్ చౌరస్తా వద్ద ఇదే హైవేపై జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. జహీరాబాద్ వైపు నుంచి హైదరాబాద్‌కు వేగంగా వెళ్తున్న కారు డివైడర్‌ను ఢీకొని ఎగిరి రోడ్డుకు అవతలి వైపు ఎదురుగా వస్తున్న మరో కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎంఆర్‌ఎఫ్ కంపెనీ ఉద్యోగి మల్లన్న, శంకర్ మృతి చెందారు. వీరు సదాశివపేటకు చెందిన వారుగా భావిస్తున్నారు.

## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం.. ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా' అంటూ దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను షేర్ చేసుకున్న ప్రధాని.. ఆగస్టు 15ను గర్వంగా జరుపుకోవాలని సూచించారు. 'వికసిత్ భారత్' నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. "ప్రతి ఇంటా హర్ ఘర్ తిరంగాను ఓ వేడుకగా మార్చుకుందాం" అని పేర్కొన్నారు. ఇటీవల 'ఎక్స్' వేదికగానూ మోదీ 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రజలను కోరారు. త్రివర్ణ పతాకం దేశ గర్వానికి ప్రతీక అని తెలిపారు. దేశం కోసం అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తిని అది అందిస్తుందని పేర్కొన్నారు. ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందేమాతరం' 150వ వార్షికోత్సవానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. దేశభక్తి, త్రివర్ణం పతాకంపై గర్వం, మాతృభూమిపై ప్రేమను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రారంభమైన 'హర్ ఘర్ తిరంగా' ద్వారా జాతీయ పతాకంతో ప్రజలకు మరింత వ్యక్తిగత అనుబంధం ఏర్పడేలా ప్రోత్సహిస్తున్నారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక



# ఒక్క రూపాయి ఖర్చు లేకుండా.. నిమ్స్‌లో ఉచితంగా గుండె ఆపరేషన్లు







**ఈ నెల 13 నుంచి చిన్నారులకు నిమ్స్‌లో గుండె ఆపరేషన్లు**

**ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా పూర్తిగా ఉచిత వైద్యం**

**అపాయింట్‌మెంట్ అవసరం లేదు.. నేరుగా నిమ్స్‌కు రావచ్చని సూచన**

**హైదరాబాద్, ఆగస్టు 11 (నేటి ప్రస్థానం):** గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు నిమ్స్ శుభవార్త అందించింది. ఆర్థిక ఇబ్బందులతో గుండె శస్త్రచికిత్స చేయించుకోలేని పిల్లలకు ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించేందుకు నిమ్స్ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 13 నుంచి శస్త్రచికిత్సలను ప్రారంభించనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. వైద్య పరీక్షల్లో శస్త్రచికిత్స అవసరమని తేలిన చిన్నారులకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఉచితంగా చికిత్స అందిస్తామని పేర్కొన్నారు.

**ఐదేళ్లుగా ఉచిత సేవలు...**

చిన్నారులకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు నిర్వహించే కార్యక్రమాన్ని నిమ్స్ గత ఐదేళ్లుగా కొనసాగిస్తోంది. ఈసారి కూడా ప్రత్యేక వైద్య బృందం ఆధ్వర్యంలో శస్త్రచికిత్సలు చేపట్టనున్నారు. పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ రమణ తన్నషునేని, సాంకేతిక నిపుణుల బృందం సహకారంతో నిమ్స్ కార్డియో థొరాసిక్ సర్జరీ విభాగాధిపతి అమరేశ్వర్ నేతృత్వంలో ఈ ఆపరేషన్లు నిర్వహించనున్నారు.

**అపాయింట్‌మెంట్ లేకుండానే..!**

గుండె శస్త్రచికిత్స అవసరమున్న చిన్నారులను తల్లిదండ్రులు నేరుగా నిమ్స్‌కు తీసుకురావచ్చని అధికారులు తెలిపారు. నిమ్స్ పాత బ్లాక్‌లోని మొదటి అంతస్తులో ఉన్న సీటీ సర్జరీ కార్యాలయంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకోసం ముందస్తు అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. మరిన్ని వివరాల కోసం 040-23489025 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.







# ఆటో డ్రైవర్ల ఆగ్రహం..

**జనగామ కలెక్టరేట్ ముట్టడి, కీలక డిమాండ్లు!**

- ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో కార్మికుల డిమాండ్
- ప్రమాద బీమా పునరుద్ధరించాలి.. ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని వినతి
- డిమాండ్లు పరిష్కరించకపోతే ఈ నెల 23న సమ్మెకు దిగుతామని హెచ్చరిక

జనగామ, ఆగస్టు 11, (నేటి ప్రస్థానం): ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జనగామ జిల్లా కలెక్టరేట్‌ను ఆటో డ్రైవర్లు ముట్టడించారు. తమకు ప్రభుత్వం నుంచి తక్షణమే ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు సంక్షేమ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు కలెక్టరేట్ వద్దకు చేరుకుని తమ సమస్యలపై నినాదాలు చేశారు. ఆటో కార్మికులకు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని, ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని వారు కోరారు. గతంలో అమలులో ఉన్న ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే వివిధ కారణాలతో ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆటో కార్మికుల ఉపాధిపై ప్రభావం చూపుతున్న ఓలా, ఉబర్, రాపిడో వంటి ఆన్‌లైన్ క్యాబ్ సేవలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ-ఆటోల నిర్ణయాన్ని కూడా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని కోరారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఈ నెల 23న సమ్మె చేపడతామని ఆటో డ్రైవర్లు హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

మల్కాజిగిరిలో పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి సాయం.. రూ.21.02 లక్షల చెక్కుల పంపిణీ

# మల్కాజిగిరిలో 21 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

**మొత్తం రూ.21,02,436 విలువైన చెక్కులు అందజేత**

**అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**



**మల్కాజిగిరి, ఆగస్టు 11, (నేటి ప్రస్థానం):** అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని మల్కాజిగిరి ఎమ్మెల్యే తెలిపారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు కల్యాణలక్ష్మి పథకం ఆర్థికంగా అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. మల్కాజిగిరి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 21 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఎమ్మెల్యే, తహసీల్దార్ కలిసి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మొత్తం రూ.21,02,436 విలువైన చెక్కులను పంపిణీ చేశారు.ఆడపిల్లల వివాహ సమయంలో ప్రభుత్వం అందించే కల్యాణలక్ష్మి ఆర్థిక సాయం పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంసీ వద్ద హైటెన్షన్..

**వెయ్యి మంది చెత్త కార్మికుల ఆందోళన – అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత!**

**చెత్త సేకరణ కార్మికుల ఆగ్రహం.. సీఎంసీ కార్యాలయం వద్ద టెన్షన్ వాతావరణం**

**సుమారు వెయ్యి మంది కార్మికులతో సీఎంసీ కార్యాలయం ముట్టడి**

**పోలీసులు అడ్డుకోవడంతో కార్మికులు, పోలీసుల మధ్య తోపులాట**

**డిమాండ్లు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిక**



**మాదాపూర్, ఆగస్టు 11( నేటి ప్రస్థానం):** చెత్త సేకరణ కార్మికుల ఆందోళనతో మాదాపూర్‌లోని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కార్యాలయం వద్ద మంగళవారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. తెలంగాణ స్వచ్ఛ ఆటో, రిక్షా కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మంది చెత్త సేకరణ కార్మికులు సీఎంసీ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయంలోకి వెళ్లేందుకు కార్మికులు ప్రయత్నించగా పోలీసులు ప్రధాన గేటు వద్ద వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య కొద్దిసేపు తోపులాట చోటుచేసుకుంది. కార్మికుల జీవనోపాధికి ఇబ్బంది కలిగించేలా సీఎంసీ కమిషనర్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని యూనియన్ నాయకులు ఆరోపించారు. 'స్వచ్ఛ సీఎంసీ' పేరుతో చెత్త పన్నును ఆస్తిపన్నుతో కలిపి వసూలు చేసే విధానాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ విధానం వల్ల తమకు లభించాల్సిన ఆదాయంపై ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమను గతంలో కొనసాగించిన విధంగానే పారిశుద్ధ్య పనుల్లో కొనసాగించాలని కార్మికులు కోరారు. ఆస్తిపన్నుతో కలిపి చెత్త పన్ను వసూలు చేసే విధానాన్ని ఉపసంహరించుకోవాలని, ఎలక్ట్రిక్ ఆటోల పేరుతో కొత్త ఆటోలను ప్రవేశపెట్టి తమ ఉపాధిని దెబ్బతీయవద్దని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాంకీ సంస్థకు వ్యతిరేకంగా కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను అధికారులు వెంటనే పరిష్కరించాలని యూనియన్ నాయకులు కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# 48 ప్రభుత్వ పాఠశాలల నిధుల వినియోగంపై ఆడిట్.. అసలు ఏం బయటపడనుంది?

**2025--26 నిధుల వినియోగంపై సమగ్ర పరిశీలన**

**బిల్లులు, రికార్డులు, ఖర్చుల వివరాల తనిఖీ**

**నిధుల వినియోగంపై పాఠశాలల్లో ఆడిట్**



**జిన్నారం, ఆగస్టు 11 (నేటి ప్రస్థానం):** ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించిన నిధులు నిబంధనల ప్రకారం వినియోగించారా? రికార్డులు సక్రమంగా నిర్వహించారా? అనే అంశాలపై అధికారులు ఆడిట్ నిర్వహించారు. 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిన్నారం మండలంలోని 48 ప్రభుత్వ పాఠశాలలు, స్కూల్ కాంప్లెక్స్‌లు, ఎంఆర్‌సీకి సంబంధించిన నిధుల వినియోగంపై మంగళవారం పటాన్‌చెరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ ప్రక్రియ చేపట్టారు. ఆడిటర్ రమేష్ ఆధ్వర్యంలో పాఠశాలలకు కేటాయించిన నిధులు, వాటి వినియోగానికి సంబంధించిన రికార్డులు, ఖర్చుల వివరాలు, బిల్లులు, ఇతర సంబంధిత పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిధుల ఖర్చులో పారదర్శకత పాటించారా? రికార్డులు నిబంధనల మేరకు నిర్వహించారా? అనే అంశాలను ప్రధానంగా తనిఖీ చేశారు. పాఠశాలల వారీగా అందుబాటులో ఉన్న రికార్డులను పరిశీలించిన అనంతరం ఆడిట్ ప్రక్రియను పూర్తి చేశారు. ప్రభుత్వ నిధుల వినియోగంలో జవాబుదారీతనం, పారదర్శకతను నిర్ధారించడంలో భాగంగానే ఈ తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి విద్యాధికారి విజయ్‌కుమార్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ శైలజ, ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆడిట్ సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల ఇంటికే ప్రభుత్వ సాయం.. లబ్ధిదారుడి ఇంటివద్ద CMRF చెక్కు అందజేత

**లబ్ధిదారుడికి రూ.56 వేల జవీ=ఖీ చెక్కును ఇంటివద్దే అందజేసిన ప్రణవ్ బాబు**

**పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి**

**కరీంనగర్, ఆగస్టు 11, (నేటి ప్రస్థానం):** అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పేద కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) ద్వారా మంజూరైన ఆర్థిక సాయం అందింది. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం జగ్గయ్యపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారుడి ఇంటివద్దే హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ప్రణవ్ బాబు రూ.56 వేల జవీ=ఖీ చెక్కును అందజేశారు. వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రణవ్ బాబు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అండగా ఉంటోందని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు జవీ=ఖీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని చెప్పారు. ప్రజలకు అవసరమైన సమయంలో వారికి అండగా నిలిచి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు అర్హులైన వారికి వాటి ప్రయోజనాలు అందేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ప్రణవ్ బాబు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందుతున్న ఆర్థిక సాయం ఎంతో ఊరటనిస్తోందన్నారు. జవీ=ఖీ చెక్కును లబ్ధిదారుడి ఇంటివద్దే అందజేయడంతో కుటుంబ సభ్యులు ప్రణవ్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. తమకు ఆర్థిక ఇబ్బందులు ఉన్న సమయంలో ప్రభుత్వం నుంచి అందిన సాయం వైద్య ఖర్చులకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారుడి కుటుంబాన్ని పరామర్శించి, ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.





# 200 మీటర్ల త్రివర్ణ పతాకంతో సుల్తానాబాద్‌లో భారీ తిరంగా ర్యాలీ

**హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భారీ ర్యాలీ.. 2,000 మంది విద్యార్థుల సందడి**

**ప్రధాన వీధుల్లో 200 మీటర్ల జాతీయ జెండాతో ప్రదర్శన**

**ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ నాయకుల పిలుపు**

**సుల్తానాబాద్, ఆగస్టు 11 (నేటి ప్రస్థానం):** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సుల్తానాబాద్ మండల కేంద్రంలో మంగళవారం దేశభక్తి వెల్లివిరిసింది. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. సుమారు 2,000 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని 200 మీటర్ల పొడవైన భారీ త్రివర్ణ పతాకాన్ని చేతబూని పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థుల దేశభక్తి నినాదాలతో పట్టణం మార్మోగింది. బీజేపీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, హర్ ఘర్ తిరంగా కన్వీనర్ ఉషణ అన్వేష్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, రాష్ట్ర నాయకుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు మీసా అర్జున్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ర్యాలీ సందర్భంగా విద్యార్థులు, నాయకులు జాతీయ జెండాలను చేతబూని దేశభక్తిని చాటారు. ఈ సందర్భంగా కర్రె సంజీవరెడ్డి మాట్లాడుతూ.. జాతీయ జెండా దేశ సార్వభౌమత్వం, ఐక్యత, త్యాగాలకు ప్రతీక అని అన్నారు. ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావనను పెంపొందించడమే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. దేశ సమగ్రతను కాపాడటంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కందుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి స్ఫూర్తిని చాటాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సౌదరి మహేందర్ యాదవ్, కాసాగోని నిర్మలతో పాటు పలువురు మండల నాయకులు, కార్యకర్తలు, వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

## దివంగత ప్రధాని మన్మోహన్ ప్రభావశీలి

**కోల్‌స్కామ్‌లో క్లీన్‌చిట్‌పై సోనియా కీలక వ్యాఖ్యలు**

**మోడీ ఇకనైనా తనను తాను క్షమించుకోవాలంటూ చురక**

న్యూఢిల్లీ,ఆగస్ట్: కోల్ స్కామ్ కేసులో దివంగత నేత, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సుప్రీం కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంపై కాంగ్రెస్ నేత సోనియా గాంధీ మంగళవారం కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ ప్రధాని సింగ్‌ను అత్యంత ప్రభావశీలమైన ప్రధానిగా, మృదుస్వభావిగా చరిత్ర ఎప్పటికీ గుర్తుంచు కుంటుందని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ప్రభుత్వంతో పోలిస్తే ఆయన తన నైతికత, జవాబుదారితనంతో పూర్తి భిన్నమైన వ్యక్తిగా కనిపిస్తారని అన్నారు. ఈ తీర్పుతో భారత రాజకీయంలో ఒక విషాదకర ఘట్టానికి ముగింపు పడిందని వ్యాఖ్యానించారు. నీతినిజాయతీ కలిగిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నానికి ఫుల్ స్టాప్ పడిందని వ్యాఖ్యానించారు. 'దివంగత నేత మన్మోహన్ సింగ్‌కు వ్యతిరేకంగా ఒక లాబీ పూర్తిసన్నద్ధతతో, సమన్వయంతో పనిచేసింది. అధికార గణం మొదలు న్యాయవ్యవస్థకు చెందిన వారు, పౌర సమాజం, ఆర్ఎస్ఎస్ బీజేపీ అందరూ ఉన్నారు. నాటి ఆరోపణలన్నీ బోగస్ అని నేడు రుజువైంది. డా. మన్మోహన్ సింగ్ నిర్దోషి అన్న విషయం స్పష్టంగా తేలింది' అని ఓ జాతీయ వార్త పత్రికలోని వ్యాసంలో సోనియా గాంధీ రాసుకొచ్చారు. ప్రత్యర్థులను టార్గెట్ చేసేందుకు ఈడీ, సీబీఐ వంటి సంస్థలను మోదీ ప్రభుత్వం దుర్వినియోగపరిచిందని కూడా ఎంపీ సోనియా గాంధీ ఆరోపించారు. 'వాటి లక్ష్యం ప్రత్యర్థులపై ఒత్తిడి తేవడమే. కొందరి గొంతు నొక్కారు.

# స్వాతంత్ర్య వేడుకలకు సిరిసిల్ల సిద్ధం..

**అధికారులకు కలెక్టర్ కీలక ఆదేశాలు**

**సిరిసిల్ల జిల్లాలో ఆగస్టు 15 వేడుకలపై కలెక్టర్, ఎస్పీ సమీక్ష**

**ఆగస్టు 15 వేడుకలను ఘనంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు**

**వేదిక, జెండా ఆవిష్కరణ, శకటాలు, స్టాల్స్‌పై అధికారులతో సమావేశం**

**విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి.. తాగునీటి వసతి కల్పించాలని ఆదేశం**



**సిరిసిల్ల, ఆగస్టు 11 (నేటి ప్రస్థానం):** ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా, పకడ్బందీగా నిర్వహించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితెతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జెండా ఆవిష్కరణ, వేదిక, మైదానం ఏర్పాట్లను పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పూర్తి చేయాలని, అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా వేడుకలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించేలా స్టాల్స్, శకటాలను ఏర్పాటు చేయాలని, విద్యార్థులతో దేశభక్తిని చాటే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసేందుకు ప్రతిపాదనలు నిర్ణీత గడువులోగా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సంక్షిప్త నివేదికలను జిల్లా పౌర సంబంధాల అధికారికి అందజేయాలని సూచించారు. జిల్లాకు చెందిన ప్రముఖులు, వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వ్యక్తులను వేడుకలకు ఆహ్వానించాలని, కార్యక్రమం సందర్భంగా విద్యుత్ అంతరాయం లేకుండా చూడటంతోపాటు ప్రజలు, అధికారులు, విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు కూడా వేడుకల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్వో జయశ్రీ, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో 30 ఏళ్ల కష్టం..

## చివరికి జనసేన వైపు అడుగులు - కరాటే ప్రభాకర్

**కాంగ్రెస్‌లో మూడు దశాబ్దాలుగా పనిచేసినా తగిన గుర్తింపు దక్కలేదని కరాటే ప్రభాకర్ ఆవేదన**

**వరంగల్ తూర్పులో కాంగ్రెస్ మూడు ముక్కలాటగా మారిందని విమర్శ**

**రానున్న రోజుల్లో కాంగ్రెస్ నుంచి పలువురు జనసేనలో చేరుతారని కీలక వ్యాఖ్యలు**

**30 ఏళ్లు కాంగ్రెస్ కోసం పనిచేశా.. గుర్తింపు మాత్రం దక్కలేదు: కరాటే ప్రభాకర్**




**వరంగల్, ఆగస్టు 11, ( నేటి ప్రస్థానం):** కాంగ్రెస్ పార్టీలో మూడు దశాబ్దాలుగా పని చేసి, పార్టీ అధికారంలో లేని సమయంలోనూ అంకితభావంతో పనిచేసినప్పటికీ తనకు తగిన గుర్తింపు, గౌరవం లభించలేదని జనసేన పార్టీ నాయకుడు కరాటే ప్రభాకర్ అన్నారు. వరంగల్‌లోని తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి మూడు ముక్కలాటగా మారిందని ప్రభాకర్ ఆరోపించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడికి పదవి ఇచ్చినప్పటికీ కనీస గౌరవం, గుర్తింపు లేకుండా కొందరు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తూర్పు నియోజకవర్గంలో పదవులను 'నీకు ఒకటి.. నాకు ఒకటి' అన్నట్లుగా సినిమా టికెట్ల మాదిరిగా పంచుకుంటున్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలో తనను ఎన్నో విధాలుగా ఒత్తిళ్లకు గురిచేశారని ప్రభాకర్ తెలిపారు. పార్టీ అధికారంలో లేని సమయంలోనూ తాను ఎంతో కష్టపడి పనిచేశానని గుర్తుచేశారు. అయితే, తన సేవలకు తగిన గుర్తింపు లభించకపోవడంతో జనసేన పార్టీలో చేరినట్లు చెప్పారు. పవన్ కల్యాణ్ కోసం మాత్రమే పార్టీలోకి రాలేదని, పేద ప్రజలకు మంచి చేయాలనే జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆలోచనా విధానం నచ్చి పార్టీలో చేరానని ప్రభాకర్ స్పష్టం చేశారు. జనసేన పార్టీ అధిష్ఠానం తనకు అప్పగించే ఏ బాధ్యతనైనా కట్టుబడి నిర్వహిస్తానని, పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. అలాగే రానున్న రోజుల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పలువురు జనసేనలో చేరే అవకాశం ఉందని ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. పేద ప్రజల అభివృద్ధి కోసం పనిచేస్తూ జనసేనను బలోపేతం చేయడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# యూపిఐ పేమెంట్స్‌పై ఛార్జీలు ఉండవు

**కమ్యూనిస్టులు అబద్దాల ప్రచారం తగదన్న నిర్మల**

న్యూఢిల్లీ: రూపే, గూగుల్‌పే, ఫోన్‌పే వంటి యూన్ఫి÷డ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)ల ద్వారా జరిపే లావాదేవీలకు ఛార్జీలు వసూలు చేస్తారన్న అనుమానాలపై ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. ముఖ్యంగా కమ్యూనిస్టులు ఇలాంటివి ప్రచారం చేయడంలో ముందుంటారని ఎద్దేవా చేశారు. వీటిని ఉపయోగించే వినియోగదారుల నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయబోరని పేర్కొన్నారు. కొన్ని రకాల లావాదేవీలకు మాత్రర భవిష్యత్తులో మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వసూలు చేసే అవకాశం ఉందని తెలిపారు. దీనిని ఇంకా ఖరారు చేయలేదని, తరువాత నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. ఛార్జీలు వసూలు చేసేందుకు వీలు కలిగేంచేలా చట్టాన్ని సవరించామే తప్ప, వినియోగదారుల నుంచి ఇప్పటికిప్పుడు వసూలు చేయడానికి కాదని చెప్పారు. ఏ వస్తువుపై ఎండీఆర్ వసూలు చేయాలి

# ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులకు మరో ఛాన్స్.. ఆగస్టు 15 వరకు గడువు

**అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులకు మరో 5 రోజులు అవకాశం**

**హైదరాబాద్‌లో లక్ష ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం**

**కూకట్‌పల్లి నుంచి అత్యధికంగా 6 వేలకుపైగా దరఖాస్తులు**




**హైదరాబాద్, ఆగస్టు 11:** సొంత ఇల్లు లేని పేద, అర్హులైన కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద దరఖాస్తుల స్వీకరణ గడువును ఆగస్టు 15 వరకు పొడిగించింది. తొలుత ఈ నెల 10తో దరఖాస్తుల గడువు ముగియాల్సి ఉండగా.. వరుస సెలవులు, బోనాల పండుగ నేపథ్యంలో పలువురు అర్హులు దరఖాస్తు చేసుకోలేకపోయిన విషయాన్ని పరిగణనలోకి తీసుకుని మరో ఐదు రోజుల సమయం ఇచ్చింది. ఈ విషయాన్ని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ నగర పరిధిలో సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేకంగా దరఖాస్తుల ప్రక్రియ చేపట్టింది. గత నెల 21 నుంచి అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం లక్ష ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో సుమారు 4.5 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని నిర్ణయించింది. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయడమే పథకం ఉద్దేశమని ప్రభుత్వం చెబుతోంది. ఇప్పటికే హైదరాబాద్‌లోని పలు నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి అత్యధిక స్పందన లభించింది. ఇక్కడి నుంచి 6 వేలకుపైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కూకట్‌పల్లి తర్వాత కుత్బుల్లాపూర్, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, అంబర్‌పేట, మేడ్చల్, సనత్‌నగర్, మల్కాజ్‌గిరి, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, సికింద్రాబాద్ కంటోన్మెంట్, రాజేంద్రనగర్ నియోజకవర్గాల నుంచి కూడా గణనీయంగా దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం అధికారులు వాటిని నిబంధనల ప్రకారం పరిశీలించనున్నారు. అర్హత ఉన్న కుటుంబాలను గుర్తించిన తర్వాత పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టనున్నారు. లాటరీ పద్ధతిలో ఇళ్ల కేటాయింపు జరుగుతుందని ప్రభుత్వం తెలిపింది. మధ్యవర్తులు, దళారులను ఆశ్రయించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. అర్హులు తమ నియోజకవర్గ పరిధిలోని మీ-సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఎంపికైన అర్హులైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించనున్నారు. దరఖాస్తు సమయంలో రూ.10 వేల సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. ఇల్లు మంజూరు కాని దరఖాస్తుదారులకు ఈ మొత్తాన్ని తిరిగి చెల్లించనున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకోని అర్హులైన కుటుంబాలు చివరి తేదీ కోసం వేచి ఉండకుండా ఆగస్టు 15లోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.



# పటాన్‌చెరు టీయూడబ్ల్యూజే వైస్ ప్రెసిడెంట్‌గా జీవరత్నం ఏకగ్రీవ ఎన్నిక

**టీయూడబ్ల్యూజే (ఐజేయూ) పటాన్‌చెరు నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్‌గా ఎంపిక**

**జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం కృషి చేస్తానని హామీ**

**తనపై నమ్మకం ఉంచిన నాయకులు, సహచరులకు కృతజ్ఞతలు**

**పటాన్‌చెరు, ఆగస్టు 11 (నేటి ప్రస్థానం):** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తానని జర్నలిస్ట్ జీవరత్నం అన్నారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే--ఐజేయూ) పటాన్‌చెరు నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్‌గా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు, జర్నలిస్టులు జీవరత్నాన్ని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను పదవిగా కాకుండా జర్నలిస్టులకు సేవ చేసే అవకాశంగా భావిస్తున్నానని జీవరత్నం తెలిపారు. నియోజకవర్గ పరిధిలో పని చేస్తున్న జర్నలిస్టుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంఘం నాయకుల సహకారంతో కృషి చేస్తానన్నారు. జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమ పథకాలు, వృత్తిపరమైన సదుపాయాలు అర్హులైన వారికి అందేలా తన వంతు కృషి చేస్తానన్నారు. జర్నలిస్టులకు అవసరమైన సమయంలో అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సంబంధిత నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకుల సహకారంతో టీయూడబ్ల్యూజే (ఐజేయూ)ను మరింత బలోపేతం చేసేందుకు పనిచేస్తానన్నారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర నాయకుడు ఫైజల్, జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, జనరల్ సెక్రటరీ అనిల్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు పత్తి నరసింహ తదితరులు జీవరత్నాన్ని అభినందించారు. పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యలపై అవగాహనతో పాటు సహచరులతో సత్సంబంధాలు కలిగిన జీవరత్నం తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తారనే నమ్మకం వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వంలో నియోజకవర్గ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మరింత కృషి జరుగుతుందని ఆకాంక్షించారు.

# బోనాల జాతరలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు.. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

ఏ.వి.బి.పురంలో ఘనంగా తలుపులమ్మ, పాతపట్నం అమ్మవారి బోనాలు

బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న పాతపట్నం ఎమ్మెల్యే

రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు మామిడి గోవిందరావు బోనాల శుభాకాంక్షలు

భక్తిశ్రద్ధలతో వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు



కూకట్‌పల్లి, ఆగస్టు 11 (నేటి ప్రస్థానం): కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఏ.వి.బి.పురంలో మంగళవారం నిర్వహించిన తలుపులమ్మ తల్లి, పాతపట్నం అమ్మవారి బోనాల ఉత్సవాల్లో శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఉత్సవాలకు హాజరైన ఆయన అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోవిందరావు మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు ప్రజలంతా అన్నదమ్ముల్లా ఐక్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ధనధాన్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే మామిడి గోవిందరావును శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఆర్ వాసు, శివాలయం అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఏ.వీ.బీ.పురంప్రెసిడెంట్ సింహాద్రి, జనరల్ సెక్రెటరీ వెంకట్రావు, దారాసింగ్, రాజు, లోకేష్, ప్రసాద్, రమణ, తిరుపతిరావు, ఏవిబి పురం ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# లవ్ స్టోరీ ఫ్లాష్‌బ్యాక్! ఎక్కడైతే తొలి పరిచయమో..

**అక్కడే 34 ఏళ్ల తర్వాత రేవంత్ దంపతులు**

**నాగార్జునసాగర్‌లో పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్న సీఎం దంపతులు**

**తొలిసారి కలిసిన ప్రదేశంలో ఫొటోలు.. సోషల్ మీడియాలో వైరల్**

**వరుణయాగంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి, గీతారెడ్డి దంపతులు**



నాగార్జునసాగర్, ఆగస్టు 11 (నేటి ప్రస్థానం): నాగార్జునసాగర్ మరోసారి సీఎం రేవంత్ రెడ్డి దంపతుల మధుర జ్ఞాపకాలకు వేదికగా నిలిచింది. వరుణయాగంలో పాల్గొనేందుకు నాగార్జునసాగర్‌కు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సతీమణి గీతారెడ్డి.. సుమారు 34 ఏళ్ల క్రితం తాము తొలిసారి కలిసిన ప్రాంతాన్ని గుర్తుచేసుకున్నారు. అధికారిక కార్యక్రమం మధ్యలో నాటి జ్ఞాపకాలను నెమరువేసుకోవడం ఆసక్తికరంగా మారింది. సుమారు మూడు దశాబ్దాల క్రితం నాగార్జునసాగర్‌లో జరిగిన తొలి పరిచయం వారి జీవితాల్లో కీలక మలుపుగా మారినట్లు సమాచారం. ఆ పరిచయం క్రమంగా స్నేహంగా, అనంతరం ప్రేమగా మారి చివరకు వివాహ బంధానికి దారితీసినట్లు తెలుస్తోంది. దీంతో నాగార్జునసాగర్ ప్రాంతంతో సీఎం దంపతులకు ప్రత్యేక అనుబంధం ఏర్పడింది. తాజాగా అదే ప్రాంతానికి వచ్చిన రేవంత్ రెడ్డి, గీతారెడ్డి దంపతులు గత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ కొంతసేపు అక్కడ గడిపారు. రేవంత్ రెడ్డి, గీతారెడ్డి తొలిసారి కలిసిన ప్రదేశంలోనే ఫొటోలు దిగారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న సీఎం దంపతుల ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. రాజకీయ, అధికారిక కార్యక్రమాలతో ఎప్పుడూ బిజీగా ఉండే సీఎం రేవంత్ రెడ్డి.. తన వ్యక్తిగత జీవితంలోని మధుర జ్ఞాపకాలను సతీమణితో కలిసి గుర్తుచేసుకోవడం నెటిజన్లను ఆకట్టుకుంటోంది. 34 ఏళ్ల క్రితం తమ పరిచయానికి వేదికైన నాగార్జునసాగర్‌కు దంపతులు మరోసారి రావడంతో ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.

# ఢిల్లీ కరాటే బరిలో తెలంగాణ విద్యార్థి సత్తా.. కాంస్య పతకం కైవసం

**టాల్కటోరా ఇండోర్ స్టేడియంలో 20వ ఆల్ ఇండియా ఇండిపెండెన్స్ కప్**

**కరాటేలో ప్రభాస్ రాజ్‌కు కాంస్య పతకం**

**జాతీయ స్థాయి పోటీల్లో మూడో స్థానంలో నిలిచిన ప్రభాస్ రాజ్**

**అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడమే లక్ష్యమని వెల్లడి**




కూకట్‌పల్లి, ఆగస్టు 11 (నేటి ప్రస్థానం): ఢిల్లీలోని టాల్కటోరా ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 20వ ఆల్ ఇండియా ఇండిపెండెన్స్ కప్ కరాటే ఛాంపియన్‌షిప్--2026లో తెలంగాణ విద్యార్థి గడ్డం ప్రభాస్ రాజ్ ప్రతిభ చాటారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్న జాతీయ స్థాయి పోటీల్లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించారు. కఠినమైన పోటీల్లో ప్రత్యర్థులను దీటుగా ఎదుర్కొంటూ ప్రభాస్ రాజ్ ఆకట్టుకునే ఆటతీరును ప్రదర్శించారు. క్రమశిక్షణ, పట్టుదలతో పాటు నిరంతర సాధనతో జాతీయ స్థాయిలో పతకం సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్నేహితులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభాస్ రాజ్ మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే కరాటేపై ఆసక్తి పెంచుకున్నానని తెలిపారు. ఈ స్థాయికి చేరుకోవడంలో తల్లిదండ్రులతో పాటు కోచ్‌లు నరేష్, వెంకటేష్ అందించిన ప్రోత్సాహం, శిక్షణ ఎంతో ఉపయోగపడిందన్నారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా సాధన చేయడం, కోచ్‌ల సూచనలు పాటించడం వల్లే జాతీయ స్థాయి పోటీల్లో రాణించగలిగానని చెప్పారు. తాను సాధించిన కాంస్య పతకం మరింత ఉన్నత స్థాయిలో రాణించాలనే స్ఫూర్తినిచ్చిందని ప్రభాస్ రాజ్ పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత కఠినంగా శిక్షణ తీసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించడమే తన లక్ష్యమని తెలిపారు. తన విజయానికి సహకరించిన తల్లిదండ్రులు, కోచ్‌లు, ఉపాధ్యాయులు, శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేసారు.

# రిటైర్డ్ ఆర్మీ జవాన్ మృతి కేసు

## యాక్సిడెంట్ చేసిన నలుగురి అరెస్ట్

హైదరాబాద్:హైదర్ షాకోట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్ మృతి కేసులో నలుగురిని అరెస్ట్ చేశామని నార్సింగి ఇన్‌స్పెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రమాదానికి కారణమైన కారు ఓనర్ శంషాబాద్‌కు చెందిన క్రాంతి గౌడ్‌గా గుర్తించినట్లు తెలిపారు. మంగళవారం ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ.. హైదర్ షా కోటలోని తన అత్తగారింటికి బోనాల పండుగ సందర్భంగా అతడు వచ్చారని చెప్పారు. తన బావమరిది వికాస్ గౌడ్‌తో కలిసి పార్టీ చేసుకున్నారని అన్నారు. అనంతరం తెల్లవారుజామున టిఫిన్ చేద్దామని లంగర్ హౌస్ వైపు వారంతా కారులో అతి వేగంగా బయలుదేరారని పేర్కొన్నారు. ఆ క్రమంలోనే రిటైర్డ్ ఆర్మీ జవాన్ రవీందర్‌తోపాటు బైక్‌ను కారుతో ఢీకొట్టారని తెలిపారు. అయితే రవీందర్ అక్కడికక్కడే మరణించగా.. బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారని చెప్పారు. ఈ కేసులో పట్టుబడిన నలుగురికి బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేశామన్నారు. వీరంతా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయిందన్నారు. అలాగే వీరికి డ్రగ్స్ పరీక్షలు కూడా నిర్వహించగా.. నెగిటివ్ వచ్చిందని పేర్కొన్నారు. ఈ ప్రమాదానికి కారణమైన వీరిపై 204 పార్ట్ 4 ఐపీసీతోపాటు మోటార్ వెహికల్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశామన్నారు.

# ప్రభుత్వ కార్యక్రమాలలో తొలుత తమిళత్తాయ్ గీతాలాపన

**సిఎం విజయ్ కు ఎంపి కమలహాసన్ అభినందన**

చెన్నై,ఆగస్ట్11:తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌పై ప్రముఖ నటుడు, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ ప్రశంసలు కురిపించారు. ప్రభుత్వ కార్యక్రమాలలో తమిళత్తాయ్ గీతాన్ని మొదటగా ఆలపించాలనే తీర్మానాన్ని శాసనసభ ఆమోదించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు కమల్ హాసన్ తన ఎక్స్ ఖాతాలో మంగళవారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'ప్రభుత్వ కార్యక్రమాలలో తమిళత్తాయ్ గీతాన్ని మొదటగా ఆలపించాలనే తీర్మానాన్ని శాసనసభలో ఆమోదించడం సంతోషకరం. ఇది కచ్చితంగా స్వాగతించదగినది. రాష్ట్ర హక్కులను వదులుకోని ఈ విధానం ఇలాగే కొనసాగాలి' అని రాసుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల్లో జాతీయ గేయమైన 'వందేమాతరం'ను మొదటగా ఆలపించాలని, ఆ తర్వాతే ఇతర గీతాలను ఆలపించాలని కేంద్ర హోంశాఖ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వాలకు అంతర్గత మార్గదర్శకాలను, సూచనలను జారీ చేసింది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అసెంబ్లీలో ఈ ప్రత్యేక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. 'తమిళం కేవలం ఒక భాష మాత్రమే కాదు, అది మన ప్రాణం, భావోద్వేగం' అని ఆయన పేర్కొన్నారు. సీఎం విజయ్ ప్రవేశపెట్టిన ఈ ప్రత్యేక తీర్మానానికి అసెంబ్లీలోని ప్రధాన ప్రతిపక్షాలైన డీఎంకే, ఏఐఏడీఎంకేతో పాటు అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపాయి.

# గల్లంతైన 65 లక్షల ఓట్లలో నాది కూడా ఉంది

**నటుడు ప్రకాశ్ రాజ్ సెల్ఫీ వీడియో**

బెంగళూరు: బెంగళూర్‌లో గల్లంతైన 65 లక్షల ఓట్లలో తనది కూడా ఉందని నటుడు ప్రకాశ్ రాజ్ తెలిపారు. ఈ విషయంపై సోషల్ మీడియాలో ఓ సెల్ఫీ వీడియోను పంచుకున్నారు. ప్రత్యేక సమగ్ర సవరణపై మాట్లాడారు. సర్' తర్వాత బెంగళూరు నియోజకవర్గంలో తొలగించిన 65 లక్షల ఓట్లలో నాది కూడా ఉంది. ఇది చాలా హాస్యాస్పదంగా అనిపిస్తోంది. నేను ఈ నియోజకవర్గంలోనే పుట్టాను. ఇక్కడే నివసించాను. చదువంతా ఇక్కడే పూర్తయింది. నటన నేర్చుకుంది కూడా ఇక్కడే. అన్నిటికంటే ముఖ్యంగా.. నేను ఈ నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థిగా కూడా పోటీ చేశాను. అయినా నా ఓటును తొలగించారని ఆ వీడియోలో చెప్పారు. మళ్లీ ఓటర్ కార్డు పొందడానికి ఏ డాక్యుమెంట్లు అడుగుతారో అని వ్యంగ్యంగా అన్నారు. తాను అన్నిటికీ సిద్ధంగా ఉన్నానని చెప్పారు. 'మీకు ఓటు వేయని వారిని తొలగించే అధికారం మీకు ఉండొచ్చు. కానీ మిమ్మల్ని అధికారం నుంచి దింపకుండా మమ్మల్ని ఆపగలరా?' అని గేమ్ ఆన్ అంటూ ప్రశ్నించారు. ఇక ప్రకాశ్ రాజ్‌కు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణతో సహా నాలుగు రాష్ట్రాల్లో ఓటరు కార్డులు ఉన్నాయనే ఆరోపణలపై ఇటీవల బెంగళూరులో కేసు నమోదైంది.

# ఖర్జూరం గింజల కాఫీ.. నో కెఫీన్.. రుచికరం, ఆరోగ్యం.. ఇలా ప్రిపేర్ చేసుకోండి



మనం రకరకాల కాఫీలు తాగుతాం. అవన్నీ కాఫీ గింజలతో తయారయ్యేవి. కానీ ఎప్పుడైనా ఖర్జూరం గింజలతో చేసిన కాఫీ తాగారా? చాలా బాగుంటుంది. దీని వల్ల ప్రత్యేక ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ఈ కాఫీ ఎలా చెయ్యాలో తెలుసుకోండి. ఖర్జూరం గింజల్ని పారేస్తున్నారా? ఆ గింజలే మీకు సూపర్ కాఫీ ఇస్తాయి! హైదరాబాద్‌లో ఉదయం కాఫీ తాగకుండా రోజు మొదలు పెట్టడం ఎంత కష్టమో మనకు తెలుసు. కానీ కాఫీ లోని కెఫీన్ వల్ల నిద్ర సరిగా పట్టదు. గుండెలో బరువు, ఏసీడిటీతో ఇబ్బంది పడేవాళ్లు చాలా మంది ఉన్నారు. అందుకే ఇప్పుడు ఒక సూపర్ ఆల్టర్నేటివ్ ఉంది. అదే ఖర్జూరం గింజల కాఫీ! ఖర్జూరం గింజల్ని వేయించి, పొడి చేసి, కాఫీలా తయారు చేసుకోవచ్చు. ఇందులో కెఫీన్ ఉండదు. రుచి నట్స్ తిన్నట్లుగా బాగుంటుంది, ఆరోగ్యానికి ఎన్నో లాభాలు ఉన్నాయని ప్లాంట్ యూ రిపోర్ట్ చేసింది. ఖర్జూరం గింజల కాఫీ పొడిని మనం ఆన్‌లైన్‌లో కొనుక్కోవచ్చు. 100 గ్రాముల ప్యాకెట్ సుమారు రూ.200 ఉంటుంది. మనీ సేవ్ చేసుకోవాలి అనుకుంటే, ఇంట్లోనే సొంతంగా చేసుకోవచ్చు. సాధారణంగా మనం ఖర్జూరం తిని, గింజల్ని పారేస్తాం. అవి గట్టిగా ఉంటాయి. వేస్ట్ అనుకుంటాం. కానీ ఇప్పుడో కొత్త ట్రెండ్ మొదలైంది. ఆ గింజల్ని సరైన పద్ధతిలో వేయించి గ్రైండ్ చేస్తే అద్భుతమైన కాఫీ పొడి వస్తుంది. ఇది కెఫీన్ ఫ్రీ అయినందున ఎవరైనా తాగవచ్చు. గర్భిణీలు, బీపీ, షుగర్, ఇన్సోమ్నియా ఉన్నవాళ్లు కూడా వాడొచ్చని చీణుం రిపోర్ట్ చేసింది. ఈ కాఫీలో యాంటీఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. బాడీలో చెడు వ్యర్థాల్ని తొలగిస్తాయి. ఫైబర్ ఎక్కువ కాబట్టి జీర్ణక్రియ మెరుగవుతుంది, మలబద్ధకం సమస్య తీరుతుంది. బ్లడ్‌లో షుగర్ లెవెల్స్ కంట్రోల్ అవుతాయి. డయాబెటిక్ పేషెంట్లకు మంచిదని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ కాఫీ.. గుండె, లివర్, కిడ్నీలను కాపాడుతుంది. ఇది – జీరో వేస్ట్ లాంటిది. ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు, ఖర్చు దాదాపు లేనట్లే. రుచి మాత్రం.. డ్రై ఫ్రూట్స్ తిన్నట్లుగా.. నట్టీగా.. కొద్దిగా తియ్యగా.. సాధారణ కాఫీలాగానే అనిపిస్తుంది. ఏ ఆహారమైనా పాజిటివ్ ఉన్నట్లే, నెగెటివ్ అంశాలూ ఉంటాయి. ఖర్జూరం గింజల కాఫీని ఎక్కువగా తాగితే జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. గింజల్ని సరిగా క్లీన్ చేయకపోయినా లేదా ఓవర్ రోస్ట్ చేస్తే రుచి పాడవుతుంది. ఒక చిన్న కేస్ స్టడీలో ఈ కాఫీకీ, పోర్టల్ వైన్ థ్రాంబోసిస్‌కీ సంబంధం ఉండవచ్చని చెప్పారు. కాబట్టి ఈ కాఫీ తాగేముందు.. తాగాలో, వద్దో డాక్టర్ సలహా తీసుకోవాలి. ఐతే.. నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ కాఫీని కొద్ది మోతాదులో తాగితే మంచిదే. మరి దీన్ని ఎలా తయారుచేసుకోవాలో చూద్దాం. సుమారు 15 నుంచి 30 ఖర్జూరం గింజలు తీసుకోండి. ఓవెన్ లేదా స్టవ్ కడాయి, కాఫీ గ్రైండర్ లేదా మిక్సీ ఉండాలి. ఎలా చెయ్యాలంటే.. ముందుగా గింజల్ని నీళ్లతో బాగా కడగండి. ఖర్జూరం గుజ్జు, పొర అంటుకుని ఉంటే పూర్తిగా తీసేయండి. తర్వాత 1, 2 రోజులు గాలిలో, ఎండలో ఆరబెట్టండి. తర్వాత ఓవెన్‌లో 180–200ీజ (350–400ీఫ) దగ్గర 25 నుంచి 45 నిమిషాలు వేయించండి. లేదా కడాయిలో మీడియం ఫ్లేమ్ మీద నిరంతరం కదుపుతూ వేయించండి. డార్క్ బ్రౌన్ అయ్యే వరకు, కాఫీ వాసన వచ్చే వరకూ వేయించండి. తర్వాత పూర్తిగా చల్లారనివ్వండి. కాఫీ గ్రైండర్ లేదా మిక్సీలో.. ఫైన్ పౌడర్‌గా గ్రైండ్ చేయండి. ఎయిర్‌టైట్ జార్‌లో నిల్వ చేయండి. 2 నుంచి 4 వారాలు తాజాగా ఉంటుంది. 1 నుంచి 2 టీస్పూన్ల పౌడర్‌ని వేడి నీళ్లలో వేసి 5 నుంచి 10 నిమిషాలు ఉడకనివ్వండి. ఇప్పుడు ఫిల్టర్ చెయ్యండి. అందులో ఆల్రెడీ కాచిన, వేడి పాలను పోసి, పంచదార కలిపి తాగవచ్చు. కొంతమంది చక్కెర బదులు ఖర్జూర సిరప్ కలుపుకుంటారు.

# బ్లూ చీజ్‌లో ఫంగస్ ఎందుకు ఉంటుంది..? కుళ్ళిపోయినట్లుగా ఉన్న ఎందుకు ఇష్టంగా తింటారు..?




మొజరెల్లా, చెడ్డార్ , ఫెటా వంటి చీజ్ రకాలతో పాటు, ఆకుపచ్చ-నీలం రంగు గీతలు లేదా చారలతో ప్రత్యేకంగా కనిపించే 'బ్లూ చీజ్' కూడా మార్కెట్‌లో లభిస్తుంది. పిజ్జాలో అయినా, శాండ్‌విచ్‌లలో అయినా చీజ్‌ను ఎంతో ఇష్టంగా తింటారు. మొజారెల్లా, చెడ్డార్, రికోటా, ఫెటా , కాటేజ్ చీజ్ వంటి అనేక రకాల చీజ్‌లు ఉన్నాయి. వాటిలో ప్రతిదానికీ దాని ప్రత్యేకమైన రుచి ఉంటుంది. అయితే మార్కెట్లో "బ్లూ చీజ్" కూడా లభిస్తుందని మీకు తెలుసా? ఇది పసుపు రంగులో ఉండి, దానిపై ఆకుపచ్చ-నీలి రంగు మచ్చలు ఉంటాయి. ఈ ప్రత్యేకమైన రంగు శిలీంధ్రం (ఫంగస్) వల్ల వస్తుంది. అయితే దీని అర్థం చీజ్ శిలీంధ్రం వల్ల పాడైపోయిందా? ప్రజలు ఈ చీజ్‌ను అంతగా ఇష్టపడి తినడానికి కారణం ఏమిటి? ఇక్కడ తెలుసుకోండి. బ్లూ చీజ్ తన ప్రత్యేకమైన ఆకృతి, రంగును నుండి పొందుతుంది. ఇవి తినదగిన శిలీంధ్రాల రకాలు. ఈ కథనం న్యూస్18 గుజరాత్ నుండి సేకరించబడింది. ఈ ప్రత్యేకమైన రంగు శిలీంధ్రం (ఫంగస్) వల్ల వస్తుంది. అయితే దీని అర్థం చీజ్ శిలీంధ్రం వల్ల పాడైపోయిందా? ప్రజలు ఈ చీజ్‌ను అంతగా ఇష్టపడి తినడానికి కారణం ఏమిటి? ఇక్కడ తెలుసుకోండి. బ్లూ చీజ్ తన ప్రత్యేకమైన ఆకృతి, రంగును బట్టి పొందుతుంది. ఇవి తినదగిన శిలీంధ్రాల రకాలు. ఈ కథనం న్యూస్18 గుజరాత్ నుండి సేకరించబడింది. చీజ్ తయారీదారులు బ్లూ చీజ్ తయారీ ప్రక్రియలోనే ఈ శిలీంధ్రాన్ని ప్రవేశపెడతారు. దీనివల్ల చీజ్‌లోపల బూజు పెరుగుతుంది. ఈ శిలీంధ్రం చీజ్‌ను పాడుచేయకపోగా అందులోని కొవ్వులను, ప్రోటీన్లను విచ్ఛిన్నం చేసి, చీజ్‌కు దాని క్రీములాంటి ఆకృతిని, రుచిని అందిస్తుంది. బ్లూ చీజ్ ఉప్పగా, పుల్లగా ఉంటూ, మట్టి వాసనతో పాటు కొద్దిగా ఘాటైన రుచులను కలిగి ఉంటుంది. మొదట దీని రుచి కొంచెం వింతగా అనిపించవచ్చు. కానీ నాలుకకు అలవాటయ్యాక ప్రజలు దానిని ఇష్టపడటం ప్రారంభిస్తారు. బ్లూ చీజ్‌ను నేరుగా తినవచ్చు లేదా సలాడ్‌లు, పాస్తాలలోనూ, అలాగే తేనె , ఎండిన పండ్లతో కలిపి కూడా ఆస్వాదించవచ్చు. ఇది సాధారణ వంటకాలకు కూడా ఒక ప్రత్యేకమైన రుచిని జోడిస్తుంది. బ్లూ చీజ్ పోషకాలతో సమృద్ధిగా ఉంటుంది. ఇందులో కాల్షియం, ప్రోటీన్ , విటమిన్- దీ12 ఉంటాయి. ఈ చీజ్ జీర్ణకోశ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఇందులో ఉండే ప్రోబయోటిక్స్‌కు కూడా ఇది ప్రసిద్ధి చెందింది. బ్లూ చీజ్ చెఫ్‌లకు ఎంతో ఇష్టమైనది ఎందుకంటే దీనిని అతి తక్కువ శ్రమతో ఏ వంటకం రుచిని అయినా మెరుగుపరచడానికి ఉపయోగించవచ్చు.



# పిల్లల పెంపకంలో మీరు చేసే పెద్ద తప్పు ఇదే..

పిల్లలకు కార్లు, బస్సులు, కాస్ట్లీ స్కూల్ ఫీజులు కడితే సరిపోతుందా? వసతులు కల్పించినా చదువులో వెనుకబడే పిల్లల వెనుక ఉన్న ఆ కోతి కథా సీక్రెట్, వారిని సక్సెస్ బాటలో నడిపించే పక్కా లేటెస్ట్ పేరెంటింగ్ టిప్స్ ఇప్పుడు తెలుసుకోండి... ప్రస్తుత పోటీ ప్రపంచంలో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లల చదువు, భవిష్యత్తు విషయంలో విపరీతమైన ఆందోళనకు గురవుతుంటారు. పక్కింటి పిల్లవాడు క్లాస్ ఫస్ట్ వచ్చినా, చుట్టాల అబ్బాయి పెద్ద ఉద్యోగం సంపాదించినా.. వెంటనే తమ పిల్లలను వారితో పోల్చడం మొదలుపెడతారు. "నీకు అన్ని వసతులు కల్పించాను, మంచి స్కూల్లో సీటు ఇప్పించాను, ఫీజులు కట్టాను, అయినా నువ్వెందుకు సాధించలేకపోతున్నావు?" అంటూ పిల్లలపై మానసిక ఒత్తిడిని పెంచుతుంటారు. అయితే పిల్లల విజయం అనేది కేవలం వసతులు కల్పించడం వల్ల మాత్రమే రాదని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ శైలజ స్పష్టం చేస్తున్నారు. దీని వెనుక తల్లిదండ్రులు చేయాల్సిన అసలైన కృషి ఎంత ఉందో ఒక చిన్న ఆసక్తికరమైన కథ ద్వారా ఇప్పుడు క్లియర్ గా తెలుసుకుందాం. చేపలు పట్టేవాడు – కోతి కథ... ఒక ఊరిలో ఒక చేపలు పట్టే వ్యక్తి ఉండేవాడు. అతను చాలా నైపుణ్యంతో, ఒడుపుగా తన వలని గుండ్రంగా నీటిలోకి విసిరేవాడు. కొంతసేపటి తర్వాత వలను పైకి లాగగా.. అందులో ఎన్నో అందమైన, వెండి రంగులో మెరిసిపోయే చిన్న చిన్న చేప పిల్లలు దొరికాయి. వాటన్నిటినీ బుట్టలో వేసుకుని అతను విశ్రాంతిగా పడుకున్నాడు. ఈ దృశ్యాన్ని చెట్టు మీద ఉన్న ఒక కోతి గమనించింది. అది మనసులో ఇలా అనుకుంది: "ఆ మనిషి లాగే నాకు కూడా రెండు చేతులు ఉన్నాయి కదా! నేను కూడా వలని అలా విసిరి సులభంగా చేపలను పట్టేయగలను." ఆ మనిషి నిద్రిస్తున్న సమయంలో కోతి మెల్లగా కిందకు దిగి, వలను తీసుకుంది. అయితే దానికి వల వేయడం తెలియకపోవడంతో, వలను అటు ఇటు తిప్పి విసిరేసరికి అది తిరిగి దానికే చుట్టుకుపోయింది. కోతి అందులో నుంచి బయటపడటానికి ఎంత తన్నుకుందో.. అంత గట్టిగా వలలో చిక్కుకుపోయింది. అప్పుడే నిద్ర లేచిన ఆ మనిషి కోతిని చూసి, దానిని వల నుండి విడిపించాడు. తల్లిదండ్రులు గమనించాల్సిన 5 పక్కా పేరెంటింగ్ నియమాలు.. కేవలం డబ్బు సంపాదించి, వస్తువులను సమకూర్చితే సరిపోదు. మీ పిల్లలు భవిష్యత్తులో పెద్ద విజయాలు సాధించాలంటే తల్లిదండ్రుల వైపు నుండి కింది 5 రకాల సాధన, కృషి ఎంతో అవసరం. చిన్నప్పటి నుంచి పిల్లలతో కలిసి కూర్చోవడం అలవాటు చేసుకోవాలి. వారి దైనందిన కార్యకలాపాలలో భాగస్వాములు కావాలి. నిలకడ నేర్పడం: పిల్లలకు చిన్నతనం నుంచే ఏ పనిపైనైనా నిలకడ, ఏకాగ్రత వచ్చేలా శిక్షణ ఇవ్వాలి. ఇందుకోసం వారితో బ్రెయిన్ పజిల్స్ లాంటి ఆటలను ఆడించాలి. వారితో క్రమం తప్పకుండా ప్రతిరోజూ మాట్లాడాలి. వారి మనసులో ఏముందో, వారు పడుతున్న ఇబ్బందులు ఏంటో ప్రేమగా అడిగి అర్థం



# పార్లర్‌కు వెళ్లకుండానే ఇంట్లోనే బ్యూటీ డిటాక్స్.. వీకెండ్‌లో ఈ చిన్న పనులు చేయండి!



వీకెండ్‌లో ఇంట్లోనే సులభంగా చేయగల బ్యూటీ డిటాక్స్ చిట్కాలతో చర్మం, జుట్టుకు సహజమైన మెరుపును తీసుకురండి. డబుల్ క్లెన్సింగ్, ఫేస్ మాస్క్, హెయిర్ కేర్, మంచి నిద్ర వంటి అలవాట్లు మీ అందాన్ని మరింత మెరుగుపరుస్తాయి. వారం మొత్తం పని ఒత్తిడి, కాలుష్యం, మేకప్, ఎండ ప్రభావంతో చర్మం, జుట్టు తమ సహజ కాంతిని కోల్పోతాయి. అలాంటి సమయంలో వీకెండ్‌లో కొద్దిసేపు కేటాయించి సులభమైన బ్యూటీ డిటాక్స్ పాటిస్తే చర్మం తాజాగా, జుట్టు ఆరోగ్యంగా మారుతుంది. ఖరీదైన పార్లర్ ట్రీట్‌మెంట్లు అవసరం లేకుండానే ఇంట్లోనే ఈ చిట్కాలను అనుసరించి అందాన్ని మరింత పెంచుకోవచ్చు. వారం మొత్తం సన్‌స్క్రీన్, మేకప్ ఉపయోగించి ఉంటే ముందుగా ఆయిల్ బేస్డ్ క్లెన్సర్ లేదా క్లెన్సింగ్ బామ్‌తో ముఖాన్ని శుభ్రం చేయండి. అనంతరం మైల్డ్ ఫేస్‌వాష్‌తో మరోసారి కడిగితే దుమ్ము, మురికి, అదనపు నూనె పూర్తిగా తొలగిపోతాయి. దీంతో చర్మం తాజాగా కనిపిస్తుంది. చర్మంపై పేరుకుపోయిన మృత కణాలను తొలగించేందుకు వారానికి ఒక్కసారి మాత్రమే మైల్డ్ స్క్రబ్ లేదా మీ చర్మానికి సరిపోయే కెమికల్ ఎక్స్‌ఫోలియంట్ ఉపయోగించండి. గట్టిగా రుద్దడం వల్ల చర్మానికి చికాకు కలిగే అవకాశం ఉంటుంది కాబట్టి జాగ్రత్తగా చేయాలి. కొబ్బరి నూనె, బాదం నూనె లేదా ఆర్గాన్ ఆయిల్‌ను స్వల్పంగా వేడి చేసి తలకు, జుట్టుకు బాగా మసాజ్ చేయండి. కనీసం 30 నిమిషాల తర్వాత షాంపూతో తలస్నానం చేస్తే జుట్టు మృదువుగా, ఆరోగ్యంగా ఉంటుంది. జుట్టు ఎక్కువగా పొడిబారితే హెయిర్ మాస్క్ కూడా ఉపయోగించవచ్చు. అందరూ ఎక్కువగా ముఖంపైనే శ్రద్ధ పెడతారు. కానీ పెదవులు, చేతులకు కూడా సంరక్షణ అవసరం. లిప్ స్క్రబ్‌తో మృత కణాలను తొలగించి మంచి లిప్ బామ్ రాయండి. చేతులకు మాయిశ్చరైజింగ్ హ్యాండ్ క్రీమ్ ఉపయోగించడం వల్ల పొడిబారడం తగ్గుతుంది. ఆరోగ్యకరమైన చర్మానికి తగినంత నీరు తాగడం చాలా ముఖ్యం. రోజంతా ఎక్కువ నీరు తాగడంతో పాటు దోసకాయ, పుచ్చకాయ వంటి నీటి శాతం అధికంగా ఉండే రోజుకు 7 నుంచి 8 గంటల నాణ్యమైన నిద్ర శరీరానికి, చర్మానికి ఎంతో అవసరం. నిద్ర సమయంలో చర్మ కణాలు పునరుద్ధరణ చెందుతాయి. దీంతో మరుసటి రోజు ముఖం మరింత తాజాగా, కాంతివంతంగా కనిపిస్తుంది. సీజనల్ పండ్లు, తాజా కూరగాయలు, ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల చర్మం, జుట్టు ఆరోగ్యంగా ఉంటాయి. బయటి సంరక్షణతో పాటు లోపలి పోషణ కూడా సమానంగా అవసరం. వీకెండ్‌లో ఈ చిన్న చిన్న బ్యూటీ డిటాక్స్ అలవాట్లను పాటిస్తే ఖరీదైన ట్రీట్‌మెంట్లు లేకుండానే చర్మం, జుట్టు ఆరోగ్యంగా, కాంతివంతంగా మారతాయి. కొద్దిపాటి సమయాన్ని మీ కోసం కేటాయించడం ద్వారా సహజమైన అందాన్ని మరింత మెరుగుపరుచుకోవచ్చు.





## తీవ్ర హెచ్చుతగ్గుల్లో సూచీలు

ముంబై, ఆగస్టు 5 : దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనయ్యాయి. వరుసగా నాలుగోసారి రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచడం మార్కెట్ వర్గాలను రుచించలేదు. ఒక దశలో 800 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 152 పాయింట్లు అందుకొని 78,581 వద్ద ముగిసింది. మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ 9.75 పాయింట్లు అందుకొని 24,624.65 వద్ద నిలిచింది. బ్లూచిప్ సంస్థల షేర్లతోపాటు బ్యాంకింగ్, వాహన, క్యాపిటల్ గూడ్స్ షేర్లు లాభాల్లోకి రావడం కలిసొచ్చింది. అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్టీపీసీ, ఎస్బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, కొటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగియగా..టీసీఎస్, హెచ్‌సీఎల్, రిలయన్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు నష్టపోయాయి.

## బొండాడ లాభం 53 కోట్లు

BONDADA GROUP


హైదరాబాద్, ఆగస్టు 5 : రాష్ట్రానికి చెందిన ఇంజినీరింగ్ సేవల సంస్థ బొండాడ ఇంజినీరింగ్ ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.53 కోట్ల లాభాన్ని ఆర్జించింది. కిందటేడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.38.2 కోట్ల లాభంతో పోలిస్తే 38 శాతం ఎగబాకింది. సమీక్షాకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 24 శాతం ఎగబాకి రూ.691.6 కోట్లకు చేరుకున్నది. కంపెనీ తాజాగా ఏరోస్పేస్, రక్షణ రంగ వ్యాపారంలోకి అడుగుపెట్టింది. ఇందుకోసం హైదరాబాద్‌కు చెందిన కేసీఎస్ ఇంజినీరింగ్ సొల్యూషన్స్‌లో 75 శాతం వాటాను కొనుగోలు చేసింది.

## కేంద్రం కొత్త బిల్లు.. ఆ కంపెనీలకు 15 ఏళ్లు నో ట్యాక్స్!

దేశాన్ని ప్రపంచ ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన పన్నులు, ఇతర చట్టాల (సవరణ) బిల్లు-2026లో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి సంబంధించిన ఆదాయపు పన్ను రాయితీలను గణనీయంగా విస్తరించాలని ప్రతిపాదించింది. పెట్టుబడులు పెంచడం, తయారీ రంగానికి ఊతమివ్వడం, విదేశీ పెట్టుబడిదారులకు పన్ను పరమైన స్పష్టత కల్పించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది. ఇప్పటి వరకు పరిమిత కాలానికే ఉద్దేశించిన పన్ను మినహాయింపులను ఇప్పుడు 15 ఏళ్లకు పొడిగించాలని ప్రతిపాదించారు. ఈ మార్పు ప్రకారం, విదేశీ కంపెనీలు భారతీయ కాంట్రాక్ట్ తయారీ సంస్థలకు యంత్రాలు, క్యాపిటల్ ఎక్విప్‌మెంట్, టూలింగ్ వంటి పరికరాలను అందించి, భారత్‌లో ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ చేపట్టే సందర్భంలో వచ్చే ఆదాయంపై 2040-41 ఆర్థిక సంవత్సరం వరకు పన్ను మినహాయింపు లభించనుంది. పరిశ్రమ ప్రతినిధులతో జరిగిన సంప్రదింపుల తర్వాత మొదట ప్రతిపాదించిన ఐదేళ్ల గడువును మరో పదేళ్లు పెంచినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ రాయితీల పరిధిలో మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్లు, పర్సనల్ కంప్యూటర్లు, సర్వర్లు, వాటి కీలక భాగాలు వంటి ఉత్పత్తులు ఉన్నాయి. దీంతో దేశీయ తయారీ సంస్థలపై మూలధన భారం తగ్గడంతో పాటు, అంతర్జాతీయ బ్రాండ్లు భారత్‌లో మరింత విస్తృతంగా తయారీ కార్యకలాపాలు చేపట్టే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి ఇది మరింత బలాన్ని చేకూర్చనుంది. అంతేకాదు, భారతీయ తయారీ యూనిట్లకు అవసరమైన విడిభాగాలను విదేశీ సంస్థలు సమీప గిడ్డంగుల్లో నిల్వ ఉంచినప్పుడు ప్రస్తుతం వర్తించే 2 శాతం పన్నును కూడా 15 ఏళ్లపాటు మినహాయించాలని బిల్లులో ప్రతిపాదించారు. దీని వల్ల సరఫరా వ్యవస్థ మరింత సమర్థవంతంగా మారడంతో పాటు, ఉత్పత్తి ప్రక్రియలో అంతరాయాలు తగ్గే అవకాశం ఉంది. మరోవైపు, గ్లోబల్ ఫండ్ మేనేజర్లను భారత్‌కు ఆకర్షించేందుకు కూడా ప్రభుత్వం కీలక మార్పులు ప్రతిపాదించింది. ప్రస్తుతం విదేశీ ఫండ్ మేనేజర్లు భారత్‌లో కార్యకలాపాలు నిర్వహించాలంటే అనేక నిబంధనలు పాటించాల్సి ఉండగా, వాటిలో ఎక్కువ భాగాన్ని తొలగించాలని బిల్లు సూచిస్తోంది. అయితే భారతీయ పెట్టుబడిదారులు ఈ నిబంధనలను దుర్వినియోగం చేయకుండా తగిన రక్షణ చర్యలు మాత్రం కొనసాగనున్నాయి. ఈ చర్యలతో భారత్‌ను అంతర్జాతీయ పెట్టుబడులకు మరింత అనుకూల గమ్యస్థానంగా మార్చాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.



# యూపీఐ పేమెంట్స్‌పై చార్జీలు?




ఇన్నాళ్లూ డిజిటల్ పేమెంట్స్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తూ వచ్చిన మోదీ సర్కార్.. ఇక ఈ జోరుకు బ్రేకులు వేసే దిశగా వెళ్లనున్నది. అవును.. మంగళవారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పేమెంట్ అండ్ సెటిల్మెంట్ సిస్టమ్స్ చట్టం 2007కు సవరణలను ప్రతిపాదించింది. దీనివల్ల యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిగే లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్లు (ఎండీఆర్) మళ్లీ రాబోతున్నాయి. అయితే యూపీఐ సేవల విస్తరణ తదుపరి వృద్ధికి నిధుల కోసమే ఈ సవరణలు అని తెలుస్తుండగా.. సదరు చట్ట సవరణతో యూపీఐ చెల్లింపులపై చార్జీలుపడే వీలుందన్న అభిప్రాయాలూ వినిపిస్తున్నాయిప్పుడు.

**ఇదీ సంగతి..**

పేమెంట్ అండ్ సెటిల్మెంట్ సిస్టమ్స్ యాక్ట్ 2007కు సవరణలు చేస్తే యూపీఐపై ఎండీఆర్‌ను విధించడానికి కేంద్ర ప్రభుత్వానికి అవకాశం లభిస్తుంది. అలాగే ప్రస్తుతం సెక్షన్ 10ఏ కింద జీరో ఎండీఆర్ నిబంధనను రద్దు చేయవచ్చు. నిజానికి ఈ నిబంధన వల్లే ఆన్‌లైన్ పేమెంట్స్‌పై బ్యాంకులు, పేమెంట్స్ సిస్టమ్ ప్రొవైడర్స్ (పీఎస్‌పీలు)చార్జీలు వసూలు చేయడం లేదు. చట్ట సవరణతో చార్జీలు అమల్లోకి వస్తాయి. రూ.2వేలకు మించిన లావాదేవీలపై 0.3 శాతం నుంచి 0.5 శాతం వరకు ఎండీఆర్‌ను విధించే యోచనలో ఉన్నట్టు ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. అయితే వార్షిక టర్నోవర్ రూ.1.5 కోట్లు దాటిన వ్యాపారులపైనే ఈ భారం ఉండవచ్చని తెలుస్తున్నది. దీనివల్ల అంతిమంగా కొనుగోలుదారులపైనే భారం పడుతుందన్న ఆందోళనలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి.

**ఉదాహరణకు..**

ఓ కస్టమర్ రూ.1,000 విలువైన వస్తువును ఓ షాపులో కొన్నారు. క్రెడిట్, డెబిట్ కార్డు లేదా యూపీఐ యాప్ ద్వారా చెల్లించారు. జీరో ఎండీఆర్ పాలసీ వల్ల ఇప్పుడు ఈ పేమెంట్‌ను కస్టమర్‌కు చెందిన బ్యాంక్, వ్యాపారికి చెందిన బ్యాంక్‌లతోపాటు పీఎస్‌పీలు ఉచితంగానే ప్రాసెస్ చేస్తున్నాయి. దీనివల్ల సదరు వస్తువును అమ్మిన వ్యాపారి ఖాతాలో రూ.1,000 జమ అవుతున్నది. అయితే జీరో ఎండీఆర్ పాలసీ రైద్దైతే కస్టమర్ పేమెంట్‌ను ప్రాసెస్ చేసినందుకు బ్యాంకులు, పీఎస్‌పీలు వ్యాపారుల దగ్గర చార్జీలను వసూలు చేస్తాయి. దీనివల్ల వ్యాపారి ఖాతాలో రూ.1,000 కంటే తక్కువ జమవుతుంది. అయితే నష్టపోతున్న సదరు చార్జీ మొత్తాన్ని వ్యాపారులు కస్టమర్ దగ్గరే వసూలు చేసే వీలుందని ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. ప్రభుత్వ పెద్దలు తాము కస్టమర్ల పేమెంట్స్‌పై చార్జీలు వేయట్లేదంటున్నా.. ప్రాసెసింగ్ లేదా అదనపు చార్జీల పేరిటనో, వస్తువు ధరను పెంచో వ్యాపారులు కొనుగోలుదారుల వద్దే ఆ చార్జీలను రాబడుతారని హెచ్చరిస్తుండటం గమనార్హం. పైగా దీనివల్ల నెమ్మదిగా యూపీఐ లావాదేవీలు తగ్గుముఖం పట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదని వారంటున్నారు. పాత పెద్ద నోట్ల రద్దుతో దేశంలో ఆన్‌లైన్ చెల్లింపులను కేంద్రం ప్రోత్సహించిన సంగతి విదితమే.

**పార్లమెంటరీ కమిటీ సూచన?**

ఆర్థిక వ్యవహారాలపై ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ ఏడాది మార్చిలో ఇచ్చిన నివేదిక ప్రకారం దేశంలో ఇప్పుడు జరుగుతున్న అన్ని డిజిటల్ లావాదేవీలలో దాదాపు 88 శాతం యూపీఐ ఆధారంగా చేస్తున్నవే. బ్యాంకులు, పీఎస్‌పీలు ప్రతి నెలా సుమారు రూ.30 లక్షల కోట్ల విలువైన 23 బిలియన్లకుపైగా లావాదేవీలను ప్రాసెస్ చేస్తున్నాయని కూడా కమిటీ తెలిపింది. ఈ క్రమంలోనే జీరో ఎండీఆర్ పాలసీ.. యూపీఐ ఎకోసిస్టమ్‌ను దీర్ఘకాలంలో ఆర్థికంగా అస్థిరపర్చగలదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అందుకే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజా చర్యలకు దిగినట్టు చెప్తున్నారు.జబతీతీవఅఎఅవం ఢ ఖీశీతీవఅస్త్రఅ జుఇఎష్టుఅస్త్రవ

**ఇండస్ట్రీ మాటేంది?**

గత ఏడాది మార్చిలో పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) కేంద్రానికి ఓ లేఖను సమర్పించింది. యూపీఐ, రూపే డెబిట్ కార్డ్ లావాదేవీలపై జీరో ఎండీఆర్ పాలసీని పునఃసమీక్షించాలని అందులో ఈ మెజారిటీ బ్యాంకింగేతర చెల్లింపుదారుల సంఘం కోరింది. జీరో ఎండీఆర్ విధానంతో ఆర్థిక అస్థిరత ఏర్పడే ప్రమాదముందన్నది. అందుకే రూపే డెబిట్ కార్డులపై వ్యాపారులందరికీ ఎండీఆర్‌ను ప్రతిపాదించింది. అలాగే బడా వ్యాపారులకు యూపీఐపై 0.3 శాతం ఎండీఆర్ చార్జీలు వేయాలన్నది.ఎండీఆర్ అంటే ఏమిటి? కొనుగోలుదారులు నిత్యం రకరకాల దుకాణాలు, షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్లు, మరెన్నో చోట్ల చేసే ఆన్‌లైన్ (యూపీఐ) చెల్లింపుల (గూగుల్ పే, ఫోన్‌పే మొదలైనవాటి ద్వారా)ను బ్యాంకులు, పీఎస్‌పీలు ప్రాసెస్ చేస్తాయి. ఇందుకుగాను ఆయా వ్యాపారులు వాటికి చెల్లించే ఫీజునే మర్చంట్ డిస్కౌంట్ రేట్ లేదా ఎండీఆర్ అంటారు. 2020 నుంచి యూపీఐ, రూపే డెబిట్ కార్డు లావాదేవీలకు ఎండీఆర్ 0%గానే ఉంటున్నది. డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహించడానికి అటు కస్టమర్లకు, ఇటు వ్యాపారులకు జీరో ఎండీఆర్ పాలసీని కేంద్రం వర్తింపజేస్తున్నది.


# వ్యూహాత్మక ఖనిజంగా బంగారం!



ముంబై, ఆగస్టు 4: బంగారాన్ని వ్యూహాత్మక ఖనిజంగా వర్గీకరించాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) సూచించింది. దేశీయంగా మైనింగ్‌ను ఉత్సాహపర్చేందుకు, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకొనేందుకు ఇది అవసరమని పేర్కొన్నది. గోల్డ్ మైనింగ్ కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతులతో సంబంధం లేకుండా కేంద్రం నుంచే అనుమతులు వచ్చేలా.. అదికూడా సింగిల్ విండో క్లియరెన్స్ మెకానిజమ్‌ను తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని గనుల మంత్రిత్వ శాఖతో జరిగిన చర్చల్లో డబ్ల్యూజీసీ ఇండియా ప్రాంతీయ సీఈవో సచిన్ జైన్ అన్నారు. ఈ మేరకు ఓ ఇంటర్వ్యూలో ఆయన పీటీఐకి తెలియజేశారు. కాగా, ఏడాదిపాటు బంగారాన్ని దేశ ప్రజలు కొనవద్దని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆమధ్య పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఇది.. దేశంలోకి వచ్చే పసిడి దిగుమతుల్ని తగ్గించడానికేనని ప్రభుత్వం చెప్పుకొచ్చిన సంగతీ విదితమే. దేశీయ దిగుమతుల్లో ఇంధనం తర్వాత వాటా పుత్తడిదే మరి. గల్ఫ్ వార్ కారణంగా పెరుగుతున్న ముడి చమురు ధరల దృష్ట్యా.. ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి డాలర్లను అధికంగా చెల్లించాల్సి వస్తుండటంతో.. తగ్గే బంగారం దిగుమతులతో ఆ మిగిలిన డాలర్లను అందుకు ఉపయోగించుకోవచ్చన్నది సర్కార్ యోచన. అయితే దేశంలోనే బంగారం తవ్వకాలు పెరిగితే.. ఈ సమస్య ఉండదని డబ్ల్యూజీసీ అంటున్నది.

## యాపిల్ కీలక నిర్ణయం!

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రోజురోజుకూ వేగంగా విస్తరిస్తూ.. సైబర్ సెక్యూరిటీ రంగంపైనా ప్రభావం చూపిస్తోంది. ఈ నేపథ్యంలో.. టెక్ దిగ్గజం యాపిల్ కీలక నిర్ణయం తీసుకుంది. సెక్యూరిటీ పరిశోధకులు ఒకేసారి సమర్పించగలిగే సెక్యూరిటీ రిపోర్టుల సంఖ్యపై పరిమితి విధించింది. దీనికి ప్రధాన కారణం.. చాట్‌జీపీటీ వంటి ఏఐ టూల్స్ సహాయంతో పెద్ద ఎత్తున భద్రతా లోపాలకు సంబంధించిన సమస్యలు రావడమే. దీంతో ప్రతి రిపోర్టును పరిశీలించడం యాపిల్ బృందానికి భారంగా మారిందని కంపెనీ తెలిపింది. యాపిల్‌లో ప్రతి సెక్యూరిటీ రిపోర్టును నిపుణులు విడిగా పరిశీలించి, అందులో నిజంగా లోపం ఉందా?, లేదా?.. అనే విషయాన్ని నిర్ధారిస్తారు. కానీ.. ఇటీవల ఏఐ సృష్టించిన అనేక రిపోర్టుల్లో వాస్తవానికి సంబంధం లేని లేదా.. కేవలం ఊహాజనిత సమస్యలు ఎక్కువగా ఉండటంతో, వాటిని పరిశీలించడానికే ఎక్కువ సమయం వెచ్చించాల్సి వస్తోంది. ఈ కారణంగా నిజమైన భద్రతా లోపాలను గుర్తించి వాటికి పరిష్కారం చూపే ప్రక్రియ ఆలస్యం కావచ్చని కంపెనీ భావించింది. అందుకే ఒకేసారి ఓపెన్‌గా ఉంచే సెక్యూరిటీ రిపోర్టుల సంఖ్యపై పరిమితి విధించడం జరిగింది. అయితే.. ఏఐ వల్ల ప్రతికూలతలే కాకుండా ప్రయోజనాలు కూడా ఉన్నాయని యాపిల్ చెబుతోంది. కొన్ని ఏఐ సిస్టమ్‌లు మ్యాక్‌ఓఎస్‌లో చాలా తక్కువ సమయంలోనే 50కు పైగా సంభావ్య భద్రతా లోపాలను గుర్తించాయి. వాటిలో కొన్ని చాలా కీలకమైనవిగా ఉండటంతో యాపిల్ వెంటనే సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ల ద్వారా వాటిని పరిష్కరించింది. ప్రస్తుతం యాపిల్ తన బగ్ బౌంటీ ప్రోగ్రామ్ ద్వారా నిజమైన సెక్యూరిటీ లోపాలను గుర్తించిన పరిశోధకులకు లోపం తీవ్రతను బట్టి గరిష్ఠంగా 5 మిలియన్ డాలర్ల వరకు బహుమతిని కూడా అందిస్తోంది. అయితే కొత్త పరిమితుల వల్ల భవిష్యత్తులో కొన్ని కీలకమైన నిజమైన రిపోర్టులు కూడా ఆలస్యంగా పరిశీలించే అవకాశం ఉందని సైబర్ సెక్యూరిటీ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## కార్తి జోడీగా?

ప్రస్తుతం తమిళనాడు రాజకీయ పరిణామాలకు కథానాయిక త్రిష కేంద్రబిందువుగా మారింది. మరోవైపు ఆమె రాజకీయాల్లోకి రావాలంటూ అభిమానుల నుంచి ఒత్తిడి పెరుగుతున్నది. అయితే ఈ విషయాలేవీ పట్టించుకోకుండా కొత్త సినిమా సన్నాహాల్లో త్రిష బిజీగా ఉంది. తాజా సమాచారం ప్రకారం కార్తి జోడీగా ఈ భామ ఓ సినిమా చేయబోతున్నట్లు తెలిసింది. మోహన్‌రాజా దర్శకత్వంలో కార్తి కొత్త చిత్రాన్ని ఇటీవలే ప్రకటించారు. త్వరలో షూటింగ్ ప్రారంభంకానుంది. ఈ సినిమా కోసం కథానాయిక అన్వేషణలో ఉన్న చిత్రబృందం నయనతార, త్రిష పేర్లను ప్రముఖంగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. నయనతార ప్రస్తు తం వరుస సినిమాలతో బిజీగా ఉండటంతో ఆమె డేట్స్ సర్దుబాటు అయ్యే అవకాశాలు లేవని అంటున్నారు. దాంతో ఈ సినిమాలో త్రిష ను నాయికగా ఖరారు చేయబోతున్నారని చెన్నై సినీ వర్గాల్లో వినిపిస్తున్న ది. 'పొన్నియన్ సెల్వ న్' చిత్రంలో కార్తి-త్రిష జోడీగా నటించారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి కాంబినేషన్ అభిమానుల్లో ఆసక్తినిరేకెత్తిస్తున్నది.



## ఓ యోధుడి గాథ 'కరికాల'

సందీప్‌కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రానికి 'కరికాల' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'శంబాల' ఫేమ్ యుగంధర్ ముని దర్శకత్వంలో షైనింగ్ పిక్చర్స్ పతాకంపై మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. బుధవారం టైటిల్ అనౌన్స్‌మెంట్‌తో పాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో సందీప్‌కిషన్ ఖడ్గాన్ని చేతబూని గుర్రంపై స్వారీ చేస్తూ.. సింహాన్ని వేటాడుతూ ఓ యోధుడి అవతారంలో కనిపిస్తున్నారు. సోషియో ఫాంటసీ అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు అర్థమవుతున్నది. ఈ సినిమాను రెండు భాగాలుగా తెరకెక్కించబోతున్నామని, తొలి భాగాన్ని వచ్చే ఏడాది జూలై 2న, రెండో భాగాన్ని అక్టోబర్ 28న విడుదల చేయబోతున్నామని మేకర్స్ తెలిపారు. అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్, అద్భుతమైన కథ, కథనాలతో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని దర్శకుడు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.



## రాజకీయాలపై శోభిత ధూళిపాళ సంచలన వ్యాఖ్యలు

ప్రముఖ నటి, అక్కినేని నాగచైతన్య భార్య శోభితా ధూళిపాళ తన రాజకీయ భావజాలంపై చేసిన కొన్ని వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియా వ్యాప్తంగా విపరీతమైన చర్చకు దారితీస్తున్నాయి. "నాకు వామపక్ష భావజాలం చాలా ఎక్కువ. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కమ్యూనిజమే కచ్చితంగా విజయం సాధిస్తుంది" అని ఆమె చెప్పిన మాటలు పెను దుమారమే రేపాయి. గ్లామర్ ఇండస్ట్రీలో ఉంటూ, తమ కెరీర్ దెబ్బతింటుందనే భయంతో ఏ హీరోయిన్ కూడా పొలిటికల్ ఐడియాలజీని బయటకు చెప్పేందుకు ఇష్టపడరు. అలాంటిది శోభితా ధూళిపాళ ఎలాంటి దాపరికం లేకుండా, అత్యంత ధైర్యంగా తన మనసులోని అభిప్రాయాలను బయటపెట్టడంపై కొందరు ప్రశంసలు కురిపిస్తున్నారు. వ్యక్తిగత భావ ప్రకటన స్వేచ్ఛకు గౌరవం ఇస్తూ ఆమె నిజాయతీని కొనియాడుతున్నారు. అయితే, మరికొందరు నెటిజన్లు మాత్రం ఆమె వ్యాఖ్యలపై తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. చిత్ర పరిశ్రమలో నటిగా ఉంటూ, అత్యంత విలాసవంతమైన లైఫ్‌స్టైల్‌ను గడుపుతున్న శోభిత... కమ్యూనిజం గురించి మాట్లాడటం సరికాదని కామెంట్స్ చేస్తున్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో ఆమె చెప్తున్న సిద్ధాంతాలు ఆచరణాత్మకంగా ఎంతవరకు సాధ్యమని ప్రశ్నిస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే, నాగచైతన్యతో వివాహం తర్వాత కొంత విరామం తీసుకున్న శోభిత..జ 'చీకటిలో', 'క్రాస్ రోడ్స్' వంటి ప్రాజెక్టులతో అలరించారు. ప్రస్తుతం ఇవి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం 'సిల్ బట్టా', 'వెట్టువం' వంటి వినూత్న చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు.



## అక్టోబర్‌లో సెట్స్‌పైకి 'బ్లడీ రోమియో'?

గత ఏడాది పవన్‌కల్యాణ్ 'ఓజీ' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్నారు దర్శకుడు సుజిత్. ప్రస్తుతం ఆయన లైనప్‌లో 'ఓజీ' సీక్వెల్‌తో పాటు నానితో 'బ్లడీ రోమియో' సినిమా కూడా ఉంది. 'ఓజీ-2' సెప్టెంబర్‌లో ప్రారంభంకానుందనే వార్తలు కూడా వచ్చాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం 'ఓజీ-2' సినిమాకు బ్రేకిచ్చి 'బ్లడీ రోమియో'ను పట్టాలెక్కించేందుకు దర్శకుడు సుజిత్ సిద్ధమవుతున్నారని తెలిసింది. అక్టోబర్‌లో 'బ్లడీ రోమియో' సెట్స్‌పైకి వెళ్తుందని ఫిల్మ్‌నగర్ టాక్. అయితే ఈ విషయంలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ప్రస్తుతం నాని 'ది ప్యారడైజ్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా సెప్టెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది. దీని తర్వాత 'బ్లడీ రోమియో'తో పాటు 'బ్లాస్ట్' ఫేమ్ సుభాష్ కె రాజ్ డైరెక్షన్‌లో నాని ఓ చిత్రానికి సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది.




## నాన్‌స్టాప్ షెడ్యూల్‌లో 'ఫౌజీ'

అగ్ర కథానాయకుడు ప్రభాస్ ప్రస్తుతం 'స్పిరిట్' 'ఫౌజీ' చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఇటీవలే ఇటలీ విహారయాత్ర నుంచి తిరిగొచ్చిన ఆయన హైదరాబాద్‌లో జరుగుతున్న 'ఫౌజీ' షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. డిసెంబర్ 3న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో త్వరితగతిన ఈ సినిమా షూట్‌ను పూర్తి చేయాలనే ఆలోచనలో ప్రభాస్ ఉన్నారట. అందుకోసం ఆగస్ట్ నెల మొత్తాన్ని ఈ సినిమాకే కేటాయించారని తెలిసింది. తాజా షెడ్యూల్ నాన్‌స్టాప్‌గా జరుగుతుందని, ప్రభాస్‌పై కొన్ని యాక్షన్ ఘట్టాలతో పాటు కీలక సన్నివేశాలను తెరకెక్కించబోతున్నారని తెలిసింది. 1940 దశకం నాటి స్వాతంత్ర్య సంగ్రామం, రెండో ప్రపంచయుద్ధం తాలూకు ఘటనల నేపథ్యంలో తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో ప్రభాస్ సైనికుడి పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై భారీ హైప్‌ని క్రియేట్ చేశాయి. ఇమాన్వి, మిథున్‌చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, జయప్రద, భానుచందర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, నిర్మాణం: మైత్రీ మూవీ మేకర్స్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, భూషణ్ కుమార్, రచన-దర్శకత్వం: హను





## మాఫియా డ్రామా 'మకుటం'



హీరో విశాల్ స్వీయ దర్శకత్వంలో మూడు భిన్న పాత్రల్లో కనిపించనున్న యాక్షన్ థ్రిల్లర్ 'మకుటం' ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. సముద్రతీర ప్రాంత నేపథ్యంలో ఎత్తుకుపై ఎత్తులతో సాగే గ్యాంగ్‌స్టర్ డ్రామా ఇదని సమాచారం. ప్రముఖ నిర్మాణ సంస్థ సూపర్‌గుడ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న 99వ సినిమా ఇది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. ఈ నెల 7న ట్రైలర్‌ను రిలీజ్ చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో విశాల్.. గ్యాంగ్‌స్టర్, ఓల్డ్‌ఏజ్ డాన్, కార్పొరేట్ ఎంప్లాయిగా మూడు భిన్న అవతారాల్లో కనిపిస్తున్నారు. మాఫియా నేపథ్యంలో నడిచే ఈ కథలో విశాల్ పాత్ర చిత్రణ సరికొత్త పంథాలో ఉంటుందని, జీవీ ప్రకాష్‌కుమార్ మ్యూజిక్ హైలైట్‌గా నిలుస్తుందని, భారీ స్థాయిలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని మేకర్స్ తెలిపారు. దుషార విజయన్, అంజలి, తంబి రామయ్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, కథ: రవి అరసు, నిర్మాత: ఆర్.బి.చౌదరి, దర్శకత్వం: విశాల్.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAI, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/